మహబూబ్‌నగర్ వార్త
నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగులాంబ గద్వాల/నారాయణపేట



# ఎస్టీలకు భరోసా..ఎస్టీ కమిషన్

- జాతీయ ఎస్టీ కమిషన్ పై ప్రజలకు అవగాహన కల్పించాలి
- ఎస్టీల సమస్యలు పరిష్కరించడానికి జాతీయ ఎస్టీ కమిషన్ ఫాస్ట్ ట్రాక్ కోర్టు
- సమస్యలు పరిష్కరించుకొటానికి ముందుగా అధికారులకు ఫిర్యాదు చేయండి
- పరిష్కారం కాకుంటే జాతీయ ఎస్టీ కమిషన్ కు ఫిర్యాదు చేయండి
- జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యులు జాటోతు హుస్సేన్



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఎస్టీ కమిషన్ జాతీయ సభ్యులు జాటోతు హుస్సేన్

**వనపర్తి ప్రతినిధి, సెప్టెంబరు29, ప్రభాతవార్త:** ప్రజలు తమ సమస్యల పరిష్కారానికి అధికారులు, కార్యాలయాల చుట్టూ తిరుగుతుంటారని, అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఎస్టీ కమిషన్ అధికారుల పై చర్యలు తీసుకుంటుందని జాతీయ ఎస్సి కమిషన్ సభ్యులు స్పష్టం చేశారు. మంగళవారం జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యులు జాటోతు హుస్సేన్ వనపర్తి జిల్లాలో పర్యటించి ఘనపూర్,ఎనికి తాండా, కర్నె తాండా, సవాయిగూడెం, కిష్టగిరి తాండా లలో పర్యటించి గిరిజనుల సమస్యలు తెలుసుకొని సాయంత్రం ఐడిఒసి సమావేశ మందిరంలో జిల్లా కాలెక్టర్ ఆదర్శ్ సురభి, జిల్లా ఎస్పీ సునీతా రెడ్డి తో కలిసి గిరిజనుల సమస్యల పై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజనులకు ఏ సమస్య వచ్చినా ఎన్‌సిఎస్‌టి(గ్రామ్స్ పోర్టల్ ద్వారా ఫిర్యాదు చేస్తే యుద్ధప్రాతిపదికన పరిష్కరించేందుకు ఎస్టీ కమిషన్ ఉందని ఎస్టీలకు భరోసా కల్పించారు. ఎస్టీ కమిషన్



సమీక్షా సమావేశానికి హాజరైన జిల్లా అధికారులు

అంటూ ఒకటి ఉంటుంది అది గిరిజనుల సమస్యలు ఉచితంగా ఫాస్ట్ ట్రాక్ కోర్టులో పరిష్కరిస్తుంది అనే విషయం చాలా మందికి తెలియదన్నారు. ప్రజలకు తెలియాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం గిరిజన సంక్షేమ శాఖ, వైద్య ఆరోగ్య శాఖ, పంచాయతీ రాజ్, రోడ్లు భవనాలు, అటవీ శాఖ, రెవెన్యూ, విద్యా, వ్యవసాయం, మున్సిపాలిటీ, అబ్కారీ, పోలీస్ శాఖలలో గిరిజనుల సమస్యలను గిరిజనుల నుంచి అడిగి తెలుసుకున్నారు. గిరిజన సంక్షేమ శాఖ సమీక్ష సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన వసతి గృహాలు, పాఠశాలల్లో సరైన మౌలిక సదుపాయాలు లేవని ఆవేదన వ్యక్తం చేశారు. జూన్ లో పాఠశాలలు ప్రారంభం అయితే ఇప్పటి వరకు ఒకజత ఏకరూప దుస్తులు మాత్రమే ఇచ్చారని, వసతి గృహాల్లో సరైన మరుగుదొడ్లు లేని విషయాన్ని స్వయంగా గమనించినట్లు తెలిపారు. వైద్య శాఖపై సమీక్షిస్తూ కర్నె తాండాలో ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రం నిర్మాణం పూర్తి అయి రెండు సంవత్సరాలు పూర్తి అయినప్పటికీ ఇంతవరకు మోలిక సదుపాయాలు, వైద్య సిబ్బంది లేరని గ్రామస్తులు కమిషన్ దృష్టికి తీసుకువచ్చారు. స్పందించిన కమిషన్ సభ్యులు తెలంగాణ రాష్ట్రంలో వైద్య సిబ్బంది ఖాళీలు చాలా ఉన్నాయని అందుకే సమస్య ఉందన్నారు. సాధ్యమైనంత త్వరగా సమస్య పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను సూచించారు. అంబులెన్స్ సైతం ఏర్పాటు చేయాలన్నారు. అదేవిధంగా పానగల్ మండలంలో వైద్యులు, అదనంగా ఏ ఎన్ యం నియమించాలని సూచించారు. పంచాతిరాజ్ సమీక్ష సందర్భంగా పెద్ద గూడెం తాండాలో ఉన్న ఇళ్లకు ఇంతవరకు ఇంటి నెంబర్లు ఇవ్వడం లేదని, దాని వల్ల తాండా వాసులు ఇబ్బందులు పడుతున్నారని తాండా వాసులు కమిషన్ దృష్టికి తెచ్చారు. స్పందించిన కమిషన్ సభ్యులు 15 రోజుల్లో ఇంటి నెంబర్లు ఇవ్వాలని పంచాయతీ అధికారిని ఆదేశించారు. కొన్ని తాండాలకు రోడ్డు సౌకర్యం లేదని, మరికొన్నింటికి అటవీ భూమి ఉందని రోడ్లు వేయనీయడంలేదని కమిషన్ దృష్టికి తెచ్చారు. తాండాలకు రోడ్లు వేయించాలని, అటవీ భూమి సమస్య ఉంటే జాయింట్ సర్వే చేయించి సమస్య పరిష్కారం అయ్యేవిధంగా చూడాలని అధికారులను సూచించారు. అటవీ శాఖకు సంబంధించి రైతులు ఇప్పటికే ఖాస్తులో ఉన్న రైతులకు ఇబ్బందులు పెట్టవద్దని -4లో..

## పేద ప్రజలకు అండగా ప్రజా ప్రభుత్వం

- ఇందిరమ్మ రాజ్యంలో పేదలకు పక్కా ఇల్లు
- ప్రజలకు ఇచ్చిన గ్యారంటీలను అమలు చేస్తాం
- ఎమ్మెల్యే కూచుకుల్ల రాజేష్ రెడ్డి



ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ప్రొసిడింగ్ అందజేస్తున్న ఎమ్మెల్యే

**బిజినేపల్లి, సెప్టెంబరు 29 ప్రభాతవార్త:** ప్రజలకు ఇచ్చిన గ్యారంటీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ, ప్రజల సంక్షేమం కోసం ప్రజాపాలనతో ముందుకు సాగుతున్నామని ఎమ్మెల్యే కూచుకుల్ల రాజేష్ రెడ్డి అన్నారు. ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో ఇందిరమ్మ ఇళ్ళ ప్రొసీడింగ్స్ పంపిణీ, కల్యాణ లక్ష్మి చెక్కులు ఎమ్మెల్యే పంపిణీ చేశారు. లబ్ధిదారులను ఉద్దేశించి ఎమ్మెల్యే రాజేష్ రెడ్డి మాట్లాడుతూ రైతుల సంక్షేమం కోసం రెండు లక్షల రుణమాఫీ, రైతు భరోసా, వరికి బోనస్, అందిస్తూ ప్రజలఆకాంక్షలు నెరవేర్చడానికి నిరంతరం ప్రయత్నం చేస్తున్నామన్నారు. పేదల సొంతింటి కల నెరవేర్చే లక్ష్యంతో ప్రజా ప్రభుత్వం దశల వారీగా ఇందిరమ్మ పథకం ద్వారా పేదలందరికీ ఇండ్లను అందజేస్తామని అన్నారు. ఇందిరమ్మ ఇండ్లు నిరంతరం ప్రక్రియ అని అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇండ్లు వస్తాయని చెప్పారు. గత ప్రభుత్వం పది సంవత్సరాలు బడుగు, బలహీన వర్గాల ప్రజలను విస్మరించిందని అన్నారు. ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు కురవకపోతే ప్రభుత్వంపై నిందలు మోపడం సరైంది కాదని విమర్శించారు. ఇప్పుడు ప్రజా ప్రభుత్వం ఏర్పాటు చేశాక పేదల ఆకాంక్షలు నెరవేరుస్తూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా సంక్షేమ పథకాలను అమలు చేస్తూ ముందుకుసాగుతున్నారని అన్నారు. ఇందిరమ్మ పాలనలో ప్రజల -మిగతా4లో..

## ఖరీఫ్ వరి కొనుగోళ్లకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

- జిల్లాలో ప్రొక్యూర్‌మెంట్ సెంటర్ సెల్ఫ్ అసెస్‌మెంట్ పోర్టల్ ద్వారానే వరి కొనుగోలు
- కొనుగోలు కేంద్రాలు, రవాణాపై ప్రత్యేక పర్యవేక్షణ : జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, సెప్టెంబర్ 29 ప్రభాతవార్త:** నాగర్‌కర్నూల్ జిల్లాలో ఖరీఫ్ సీజన్‌లో రైతులు పండించిన వరి ధాన్యాన్ని సకాలంలో కొనుగోలు చేసేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేసి, రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా జిల్లాలో వరి కొనుగోలు ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ అధికారులను ఆదేశించారు. మంగళవారం సాయంత్రం నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ సమావేశ మందిరంలోకొనుగోలు కేంద్రాల ఏర్పాటు, ధాన్యం రవాణా, నిల్వ, గన్నీ బ్యాగుల లభ్యత, తేమ శాతం పరిశీలన, కొనుగోలు కేంద్రాల్లో మోలిక వసతులు తదితర అంశాలపై, జిల్లా వ్యవసాయ, సంబంధిత శాఖల అధికారులతో సమన్వయ సమీక్షా సమావేశాన్ని అదనపు కలెక్టర్ బి. చెన్నయ్యతో కలిసి జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్‌పాటీల్, నిర్వహించారు జిల్లాలో ధాన్యం కొనుగోలు ప్రక్రియను రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా, పారదర్శకంగా నిర్వహించేందుకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ నాగర్ కర్నూల్ జిల్లాలోని 20 మండలాల పరిధిలో జిల్లాలో 183 వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను సిద్ధం చేయాలని, కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తీసుకువచ్చిన రైతులు ఎక్కువ సమయం వేచి ఉండాల్సిన పరిస్థితి తలెత్తకుండా తగిన ప్రణాళికతో చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. కొనుగోలు ప్రక్రియను సమన్వయంతో, పారదర్శకంగా నిర్వహిస్తూ, ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనల ప్రకారం రైతులకు సకాలంలో ప్రయోజనాలు అందేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆదేశించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో పారదర్శకతను పెంపొందించి, అక్రమాలకు తావులేకుండా ప్రతి కొనుగోలు కేంద్రాన్ని జియో ట్యాగింగ్ చేయాలని కలెక్టర్ సూచించారు. కేంద్రాలకు సంబంధించిన వివరాలను శిదీలీతిశి పోర్టల్‌లో నమోదు చేసి నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. రైతులకు అవసరమైన కనీస మోలిక సదుపాయాలు కొనుగోలు కేంద్రాల్లోఅందుబాటులో ఉన్నాయా లేదా అనే అంశంపై శిదీలీతిశి ద్వారా సెల్ఫ్ అసెస్‌మెంట్ నిర్వహించాలని సూచించారు. తూకం యంత్రాలు, తేమ కొలిచే యంత్రాలు, టార్పాలిన్లు, తాగునీటి వసతి తదితర 16 రకాల మోలిక సదుపాయాల లభ్యతను పరిశీలించి, సంబంధిత ఫొటోలు, ఆధారాలను పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసే సమయంలో -మిగతా4లో..

## రైతులకు ఇబ్బందులు రానీయొద్దు

- ధాన్యం సేకరణ చేపట్టాలి
- అక్టోబర్ 1 నుంచి ప్రారంభం
- జిల్లాలో 163 కొనుగోలు కేంద్రాల ఏర్పాటు
- మహబూబ్‌నగర్ జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా

**మహబూబ్‌నగర్ బ్యూరో, సెప్టెంబరు 29, ప్రభాతవార్త :** వానాకాలం (ఖరీఫ్) 2026-27 సీజన్‌లో ధాన్యం సేకరణను పకడ్బందీగా నిర్వహిస్తూ రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా సూచించారు. మంగళవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం సమావేశ మందిరంలో ఖరీఫ్ 2026-27 ధాన్యం కొనుగోలుపై నిర్వహించిన అవగాహనా సదస్సు, శిక్షణా కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ధాన్యంకొనుగోలు కేంద్రాల్లో అవసరమైన మౌలిక వసతులు, సిబ్బంది, గన్నీ సంచులు, తూకం, తేమ పరీక్ష, ధాన్యం శుభ్రపరిచే పరికరాలు ముందుగానే సిద్ధంగా ఉంచాలని సూచించారు. జిల్లాలో ఖరీఫ్ 2026-27లో సుమారు 4.26 లక్షల టన్నుల ధాన్యం ఉత్పత్తి అవుతుందని అంచనా ఉండగా, అందులో 1.53 లక్షల టన్నుల ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల ద్వారా సేకరించనున్నట్లు తెలిపారు. ఇందు కోసం జిల్లాలో 163 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. అక్టోబర్ 1 నుంచి కొనుగోలు కేంద్రాలను ప్రారంభించేందుకు ఏర్పాట్లు పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు. రైతులకు తాగునీరు, నీడ, కూర్చునే సౌకర్యం, విద్యుత్ తదితర వసతులు కల్పించాలని పేర్కొన్నారు. ప్రతి కొనుగోలు కేంద్రంలో సన్న, దొడ్డు రకం ధాన్యానికి వేర్వేరు కౌంటర్లు ఏర్పాటు చేయాలని, ధాన్యాన్ని జీపీఎస్ అమర్చిన వాహనాల ద్వారా సంబంధిత మిల్లులు, గోడౌన్లకు మాత్రమే తరలించాలని సూచించారు. కొనుగోలు వివరాలను ఓపిఎంఎస్‌లో అదే రోజు నమోదు చేసి, రికార్డులను సక్రమంగా నిర్వహించాలని తెలిపారు. గ్రేడ్-ఏ ధాన్యానికి క్వింటాల్‌కు రూ.2,461, సాధారణ రకానికి రూ.2,441 కనీస మద్దతు ధరగా ప్రభుత్వం నిర్ణయించిందని అధికారులు తెలిపారు. -మిగతా4లో..



హాజరైన అధికారులు

## ఎంవీఎస్‌కు మహర్దశ

- రూ. 7.95 కోట్లతో అత్యాధునిక భవనం
- కళాశాలకు కొత్త సొబగులు
- కార్పొరేట్ హంగులతో నూతన నిర్మాణాలు
- అతి త్వరలోనే మోడల్ పబ్లిక్ స్కూల్ ఏర్పాటు చేస్తాం
- ప్రభుత్వ విప్, మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి





**మహబూబ్‌నగర్, సెప్టెంబరు 29 ప్రభాత వార్త :** మహబూబ్ నగర్ పట్టణంలోని చారిత్రాత్మక ఎంవీఎస్ ప్రభుత్వ జూనియర్ కళాశాల రూపురేఖలు సమూలంగా మారనున్నాయి. పేద, మధ్యతరగతి విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి వసతులతో నాణ్యమైన విద్యను అందించే లక్ష్యంతో ప్రభుత్వం భారీ నిధులు మంజూరు చేసింది. అదేవిధంగా అతి త్వరలోనే కళాశాల ఆవరణలో తెలంగాణ పబ్లిక్ స్కూల్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలుస్తున్నది. కళాశాల నూతన భవన నిర్మాణం కోసం ప్రభుత్వం రూ. 7.95 కోట్ల నిధులను మంజూరు చేసింది. 6 ఎకరాల విశాల ప్రాంగణంలో ఆహ్లాదకరమైన వాతావరణంలో ఈ అత్యాధునిక భవనాన్ని నిర్మించనున్నారు. త్వరలోనే స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ యెన్నం శ్రీనివాస్ రెడ్డి భవన నిర్మాణపనులకు శంకుస్థాపన చేయనున్నారు.

**నూతన భవన ప్రత్యేకతలు:** విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా విశాలమైన క్లాస్ రూమ్‌లు, ప్రత్యేక పరిపాలనా విభాగాలు సైన్స్ విద్యార్థుల కోసం ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ విభాగాలకు హైటెక్ ప్రయోగశాలలు విశాలమైన రీడింగ్ రూమ్ తో కూడిన అత్యాధునిక గ్రంథాలయం, డిజిటల్ లెర్నింగ్ క్లాస్ రూమ్ లు నిరంతర శుద్ధ తాగునీరు, బాలబాలికలకు ప్రత్యేక మరుగు దొడ్లు, క్రీడా మైదానం అభివృద్ధి దశాబ్దాలుగా వేలాది మంది విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పిన ఎంవీఎస్ కళాశాలకు ఈ నూతన భవనంతో మరింత వన్నె రానుంది. ప్రభుత్వ జూనియర్ కళాశాల అంటేనే ప్రైవేట్ కళాశాలలకు దీటుగా ఉండబోతోందని విద్యార్థులు, తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

**అతి త్వరలో మోడల్ స్కూల్ ని ప్రారంభిస్తాం: ప్రభుత్వ విప్ యెన్నం శ్రీనివాస్ రెడ్డి**



ఎంవిఎస్ ఆవరణలో జూనియర్ కళాశాలను అత్యాధునిక వసతుల తో నిర్మిస్తాం. అతి త్వరలోనే అత్యాధునిక డిజిటల్ మౌలిక వసతులు, విశాలమైన తరగతి గదులతో తెలంగాణ పబ్లిక్ స్కూల్(మోడల్ స్కూల్) ఏర్పాటు చేశారు. కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా నర్సరీ నుండి ఇంటర్మీడియట్ (12వ తరగతి) వరకు ఇంగ్లీష్ మీడియంలో ఉచిత విద్య అందుతుంది. పట్టణ కేంద్రంలో అందరికీ అందుబాటులో అత్యాధునిక వసతులతో ఆరుట్ల మోడల్ స్కూల్ తరహాలో ఏర్పాటు చేయబోతున్నాం. అతి త్వరలోనే పనులకు శ్రీకారం చుడతాం.

## విద్యార్థుల ఆధార్ ఎన్రోల్మెంట్ మెరుగుపడాలి

- ఆధార్ అప్డేట్ ను నిబంధనల ప్రకారం చేయాలి
- విద్యార్థుల ఆధార్ నమోదుకు ప్రత్యేక శిబిరాల ఏర్పాటు
- గద్వాల జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

**గద్వాల సెప్టెంబర్ 29, ప్రభాతవార్త:** జిల్లాలో విద్యార్థుల ఆధార్ ఎన్రోల్మెంట్ మెరుగుపడాలని, ప్రత్యేక శిబిరాలను ఏర్పాటు చేసి ఆధార్ కార్డులను జారీ చేయాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. మంగళవారం ఐడిఓసి వీడియో కాన్ఫరెన్స్ హాల్లో డిఎల్ఏఎంసి (డిస్ట్రిక్ లెవెల్ ఆధార్ మానిటరింగ్ కమిటీ) సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కొంత మంది నకిలీ సర్టిఫికెట్స్‌తో పలు ప్రయోజనాలు పొందేందుకు ఆధార్ కార్డులలో ఇష్టానుసారం మార్పులు, చేర్పులు చేసుకుంటారని ఇలాంటి వాటికి చోటు లేకుండా నిబంధనల ప్రకారం ఆధార్ కార్డుల అప్డేట్ చేయాలన్నారు. విద్యా సంస్థలతో పాటుఅంగన్వాడి కేంద్రాల్లోని పిల్లలందరికీ ఆధార్ కార్డులు ఉండాలన్నారు. ఇందుకోసం అన్ని మండలాల్లోని గ్రామ పంచాయతీలతోపాటు మున్సిపాలిటీలలో బాలఆధార్ కేంద్రాలు, ఇతర ప్రత్యేక శిబిరాల నిర్వహణకు సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు. జనన ధ్రువీకరణ పత్రాన్ని అనుసరించి ఆధార్ కార్డులో పుట్టిన తేదీ నమోదు చేయాలని, పేర్లు, చిరునామా, తదితర మార్పుకు నిబంధనలను అనుసరించి ముందుకెళ్లాలన్నారు. ఆధార్ ఎన్రోల్మెంట్ కిట్స్ కొరతను అధిగమించేందుకు తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. దేశ పౌరుల గుర్తింపుకు ఆధార్ కార్డులకు ఎంతో ప్రాధాన్యత ఉన్నందున ఆధార్ కేంద్రాల నిర్వహకులు, సంబంధిత అధికారులు నిబద్ధతతో పనిచేయాలని ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో ఆర్డీవో శ్రీనివాస రావు, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్లు మనోజ్ కుమార్ రెడ్డి, రాజ్ కుమార్, డిడబ్ల్యూఓ సునంద, డిఇఓ విజయలక్ష్మి, డిఎంహెచ్ఓ సంధ్య కిరణ్మయి, ఎల్డిఎం శ్రీనివాసరావు, డిఎల్పిఓ ప్రవీణ్ కుమార్ రెడ్డి, ఆధార్ స్టేట్ ప్రాజెక్టు మేనేజర్ నరేష్‌చంద్ర, ఈడియం శివ, మున్సిపల్ కమిషనర్లు, ఇతర అధికారులు, ఆధార్ కేంద్రాల నిర్వహకులు, తదితరులు పాల్గొన్నారు.

## నాణ్యత ప్రమాణాల్లో నిర్లక్ష్యం తగదు

- స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్



విద్యార్థులతో కలిసి అల్పాహారం స్వీకరిస్తున్న స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్

**మహమ్మదాబాద్, సెప్టెంబరు 29, ప్రభాతవార్త :** మహమ్మదాబాద్ మండలం నంచెర్ల లోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల/ జూనియర్ కళాశాలను స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న మౌలిక సదుపాయాలు, ఆహారం నాణ్యత, పరిశుభ్రత, తాగునీరు, వసతి తదితర ఏర్పాట్లను క్షుణ్ణంగా పరిశీలించారు. తనిఖీలో భాగంగా విద్యార్థులతో కలిసి అల్పాహారం స్వీకరించిన అదనపు కలెక్టర్, వారికి అందిస్తున్న ఆహారం నాణ్యతను స్వయంగా పరిశీలించారు. అల్పాహారం నాణ్యత, పరిశుభ్రతకు సంబంధించిన ఏర్పాట్లపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆహార పదార్థాల తయారీ, నిల్వ, వడ్డింపు సమయంలో తప్పనిసరిగా పరిశుభ్రతా ప్రమాణాలను పాటించాలని సంబంధిత సిబ్బందికి సూచించారు. అనంతరం విద్యార్థులతో నేరుగా మాట్లాడిన అదనపు కలెక్టర్, వారికి అందుతున్న ఆహారం, తాగునీరు, వసతి, పారిశుద్ధ్య సదుపాయాలు, విద్యా వాతావరణం, ఇతర మౌలిక సదుపాయాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులకు సూచించారు. తనిఖీ సందర్భంగా గుర్తించిన లోపాలను తీవ్రంగా పరిగణించిన అదనపు కలెక్టర్, బాధ్యులకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని ఆర్‌సిఓ ను ఆదేశించారు. గుర్తించిన లోపాలను వెంటనే సరిదిద్దడంతో పాటు, భవిష్యత్తులో ఇటువంటి సమస్యలు పునరావృతం కాకుండా పటిష్టమైన పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు. విద్యార్థులకు నాణ్యమైన ఆహారం, పరిశుభ్రమైన వాతావరణం, మెరుగైన వసతులు అందేలా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ స్పష్టం చేశారు. విద్యార్థుల ఆరోగ్యం, భద్రత, సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, నాణ్యతా ప్రమాణాల విషయంలో ఎలాంటి నిర్లక్ష్యాన్ని సహించరాదని సంబంధిత అధికారులకు సూచించారు.



గుంపులుగా పందులు

## పందుల బెడద

- కౌకుంట్ల మండలంలో పందుల స్వైర విహారం
- పట్టించుకోని అధికారులు

-4లో..

## ఇద్దరు మున్సిపల్ ఉద్యోగుల సస్పెన్షన్

4 లో

## గుర్తు తెలియని వ్యక్తి దాడిలో మేస్త్రి మృతి


సంఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు


మృతి చెందిన మేస్త్రి

**బాలానగర్ సెప్టెంబర్ 29 ప్రభాతవార్త :** గుర్తు తెలియని వ్యక్తి దాడిలో మేస్త్రి మృతి చెందిన ఘటన మంగళవారం బాలానగర్ మండలం పెద్దాయపల్లిలో చోటుచేసుకుంది. ఎస్సై నరేందర్ రెడ్డి తెలిపిన వివరాల మేరకు, ఉత్తరప్రదేశ్‌కు చెందిన బీరేంద్ర లాల్ సాహెబ్ బెన్ వంశీ అలియాస్ రవి, గత ఏడాది కాలంగా రంగారెడ్డి జిల్లా బండ్లగూడ జాగీర్ కు చెందిన భాస్కర్ గౌడ్ వద్ద మేస్త్రిగా పనిచేస్తున్నాడు. భాస్కర్ గౌడ్ పెద్దాయపల్లి చౌరస్తా సమీపంలోని బృందావన్ టౌన్‌షిప్‌లో 366 గజాల స్థలంలో మినీ ఫంక్షన్ హాల్ నిర్మిస్తున్నాడు. బీరేంద్ర లాల్ సాహెబ్ బెన్ వంశీ నెల రోజుల క్రితం తన సొంత గ్రామానికి వెళ్లి వారం రోజుల క్రితం తిరిగి వచ్చాడు. అతనితో పాటు వివేక్ సింగ్ కూడా ఆరు రోజుల క్రితం మినీ ఫంక్షన్ హాల్ నిర్మాణ పనులకు వచ్చినట్లు పోలీసులు తెలిపారు. మంగళవారం బీరేంద్ర లాల్ సాహెబ్ బెన్ వంశీ మృతి చెందిన అనంతరం అతనితో పాటు వచ్చిన వివేక్ సింగ్ కనిపించకుండా పోవడంతో పాటు, అతని ఫోన్ స్విచ్ ఆఫ్ రావడంతో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. దీంతో ఫంక్షన్ హాల్ యజమాని భాస్కర్‌గౌడ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సమాచారం అందుకున్న రూరల్ సీఐ మహేష్, ఎస్సై నరేందర్ రెడ్డి ఘటన స్థలానికి చేరుకుని క్లూస్ టీమ్ సహాయంతో ఆధారాలు సేకరించారు. భాస్కర్ గౌడ్ ఫిర్యాదుమేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నరేందర్ రెడ్డి తెలిపారు.

## మృతురాలి కుటుంబానికి ఆర్థిక సాయం


మృతురాలి కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేస్తున్న దృశ్యం

**లింగాల, సెప్టెంబరు 29 ప్రభాతవార్త :** మండల పరిధిలోని అప్పాయిపల్లి గ్రామంలో మృతి చెందిన బాధితురాలి కుటుంబానికి పరామర్శించి ఆర్థిక సహాయాన్ని మంగళవారం అందజేసి తన దాతృత్వాన్ని చాటుకున్నారు. అప్పాయిపల్లి మాజీ సర్పంచ్ రవీందర్ నేతృత్వంలోని మనం మన భాద్యత సభ్యులు. వివరాలలోకి వెళితే అప్పాయి పల్లి గ్రామంలో దుల్లా లక్ష్మీ దేవమ్మ మృతి చెందింది. విషయాన్ని తెలుసుకున్న మాజీ సర్పంచ్ రవీందర్ నాయక్ ఆధ్వర్యంలోని మనం మభాద్యత సభ్యులు మృతురాలి కుటుంబాన్ని పరామర్శించి రూ.5 వేలు, 25 కెజిల బియ్యంను 2వవార్డు ఇంచార్జ్ శివాజీ అందజేశారు. మృతుని కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. గ్రామంలో ఎవరికి ఏఆపద వచ్చిన ఆదుకోవడానికి మనంమనబాధ్యత పేరిటమానవతాదృక్పథంతో ఆర్థిక సహాయం, బియ్యంను అందజేస్తున్నట్లు వెల్లడించారు. పేద కుటుంబంలో ఎవరైనా మృతి చెందితే వారి కుటుంబ సభ్యులకు మనం మన బాధ్యతలో భాగంగా ఆర్థిక సహాయం అందజేయడం స్ఫూర్తిదాయకమని పలువురు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో 3 వార్డు లక్ష్మిసురేష్, 6 వార్డు యాదగిరి, సలేశ్వరం 8 వార్డు, పద్మ నరేష్ 9 వార్డు, జి.నరేష్, సురేందర్ రావు, శశిధర్, దుగ్గి అశోక్, శ్రీనివాస్, శారద, రాముడు, బెక్కెం నవీన్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి రైతు ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలి


ఫార్మర్ రిజిస్ట్రీ స్పెషల్ డ్రైవ్ నిర్వహించిన వ్యవసాయ విస్తరణ అధికారి డి.సురేష్

**మూసాపేట, సెప్టెంబరు 29 ప్రభాత వార్త :** మండల పరిధిలోని చక్రాపూర్ గ్రామంలో వ్యవసాయ విస్తరణ అధికారి డి.సురేష్ ఫార్మర్ రిజిస్ట్రీ స్పెషల్ డ్రైవ్ చేపట్టడం జరిగింది. పట్టా పాసు పుస్తకం కలిగిన ప్రతి ఒక్క రైతు యొక్క ఫార్మర్ రిజిస్ట్రీని నమోదు చేసుకోవాలని సూచించారు. దీనివల్ల ఎరువుల కొనుగోలు, విత్తనాల కొనుగోలు, బ్యాంకుల ద్వారా రుణాలు, పీఎం కిసాన్, ఎన్ఎఫ్ఎస్ఎం, ఆర్‌కెవివై సబ్సిడీలు, పంటను అమ్మేటప్పుడు ఫార్మర్ ఐడి ద్వారా రైతుగా గుర్తించిమద్దతు ధర కల్పించడం జరుగుతుందని చెప్పారు. ఫార్మర్ రిజిస్ట్రీ చేసుకుని రైతులు వెంటనే మీ సమీపంలో గల రైతు వేదికలు లేదా మీసేవ, సిఎస్‌సి సెంటర్లలో తమ ఆధార్ కార్డు, ఆధార్‌లింక్ ఉన్న మొబైల్ తీసుకొని నమోదు చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జానంపేట ఏఈఓ డి.సురేష్ రైతులు పాల్గొనడం జరిగింది.

## బీజేపీ వనపర్తి జిల్లా వాణిజ్య సెల్ కన్వీనర్ కొండోజు గోపీనాథ్ నియామకం



**వనపర్తి, సెప్టెంబరు 29 ప్రభాతవార్త :** భారతీయ జనతా పార్టీ (బీజేపీ) వనపర్తి జిల్లా వాణిజ్య సెల్ కన్వీ నర్‌గా కొండోజు గోపీనాథ్ నియమి తులయ్యారు. ఈ మేరకు హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో మంగళవారం రాష్ట్ర వాణిజ్య సెల్ కన్వీనర్ ఉప్పల శారద ఆయనకు నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా గోపీనాథ్‌ను శాలువాతో సన్మానించి అభినందించారు. వనపర్తి జిల్లాలో పార్టీ బలోపేతానికి కృషి చేయడంతోపాటు వాణిజ్య వర్గాలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి కృషి చేయాలని ఉప్పల శారద సూచించారు. తనపై నమ్మకంతో అప్పగించిన బాధ్యతను సమర్థవంతంగా నిర్వహిస్తానని ఈ సందర్భంగా కొండోజు గోపీనాథ్ తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## రాజా గారి భూములు సాగు చేస్తున్న గిరిజనులకు పట్టాలు ఇప్పించండి

- జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడికి గిరిజనుల ఫిర్యాదు

**ఖిల్లా గణపురం సెప్టెంబర్ 29 ప్రభాతవార్త :** 150 సంవత్సరాలుగా గిరిజనులు సాగు చేస్తున్న రాజా గారి భూములకు పట్టాలు ఇప్పించాలని మంగళవారం గిరిజన తండాలు ముందరి తండా వెనికి తండా మేడి బై తండా కర్నే తాండ ఆముదం బండ తండా చిన్న పేరు తండా మీటియా తాండాలకు చెందిన గిరిజన రైతులు జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు హుస్సేన్ నాయక్ కు వినతి పత్రం అందజేశారు. ఆయా తాండాలకు చెందిన సర్పంచులు కవితా భరత్ రుక్మిణి రాజు ఘనంగా స్వాగతం పలికారు. మామిడి మాడ శివారులోని భూముల్లో 100ఏళ్లకు పైగా భూములను సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న రైతులందరికీ పట్టాలు ఇప్పించాలని కోరారు వారి నుండి వివరాలు సేకరించిన హుస్సేన్ నాయక్ సంబంధిత అధికారులకు మీ సమస్యను తెలియజేసి తగు న్యాయం జరిగే విధంగా ప్రయత్నిస్తానని చెప్పాడు. అనంతరం మండల కేంద్రంలోని ఎస్టీ ఆశ్రమ పాఠశాలను సందర్శించాడు పాఠశాలలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను స్వయంగా విద్యార్థులను అడిగి తెలుసుకున్నాడు వసతి గృహంలో సౌకర్యాలు భోజన వసతి త్రాగునీరు మరుగుదొడ్లు, విద్యాబోధన తీరుపై ఉపాధ్యాయులను విద్యార్థులను అడిగి ఆరా తీశారు. పాఠశాలలో ఉన్న సమస్యలను త్వరలో ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. మొదటిసారిగా జిల్లాకు విచ్చేసిన హుస్సేన్ నాయక్‌కు బిజెపి కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు అందజేసి ఘనంగా స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో జిల్లా బిజెపి అధ్యక్షుడు నారాయణ ఓ బి సి మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఆశన్న పలువురు. బిజెపి నాయకులు యువకులు పాల్గొన్నారు.



## జిల్లా న్యాయ సేవాధికార సంస్థలో ఉచిత మధ్యవర్తిత్వ సేవలు

- కేసుల్లో రాజీకి అవకాశం ఉన్నవారు సద్వినియోగం చేసుకోవాలి
- జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి జి.నిష్కా పత్రుడు



**గద్వాల సెప్టెంబర్ 29, ప్రభాతవార్త:** కోర్టుల్లో కేసులు ఉన్న కక్షిదారులు సమయం, ఖర్చు ఆదా చేసుకునేందుకు మధ్యవర్తిత్వాన్ని సద్వినియోగం చేసుకుని వివాదాలను త్వరగా పరిష్కరించుకోవాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి జి.నిష్కా పత్రుడు సూచించారు. కేంద్ర న్యాయ సేవాధికారసంస్థ ఆదేశాల మేరకు అక్టోబర్ 1 నుంచి డిసెంబర్ 31 వరకు నిర్వహించనున్న మధ్యవర్తిత్వ 3.ఓ ప్రచార కార్యక్రమంలో భాగంగా మంగళవారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కోర్టు హాల్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి జి.నిష్కా పత్రుడు మధ్యవర్తిత్వం ద్వారా కేసులు ఏ విధంగా పరిష్కరించుకోవచ్చు అనే విషయాలను కూలంకషంగా వివరించారు. సివిల్ ప్రొసీజర్ కోడ్ సెక్షన్ 89 కింద ఉన్న ప్రత్యామ్నాయ వివాద పరిష్కార విధానాల్లో మధ్యవర్తిత్వం ఒకటని తెలిపారు. మధ్యవర్తిత్వంలో ఒక తటస్థ వ్యక్తి ఇరు పక్షాలతో మాట్లాడి వారి సమస్యలను అర్థం చేసుకుని, ఇద్దరికీ ఆమోదయోగ్యమైన పరిష్కారం లభించేలా సహకరిస్తారని వివరించారు. మధ్యవర్తి ఎవరి పక్షానా ఉండరని, ఎలాంటి నిర్ణయాన్ని బలవంతంగా రుద్దరని, చివరి నిర్ణయం ఇరు పక్షాల అంగీకారంతోనే జరుగుతుందన్నారు. జోగులాంబ గద్వాల జిల్లాలో ప్రస్తుతం 11 మంది శిక్షణ పొందిన మధ్యవర్తులు అందుబాటులో ఉన్నారని తెలిపారు. వైవాహిక వివాదాలు, కుటుంబ వివాదాలు, ఆస్తి మరియు భూ వివాదాలు, డబ్బు సంబంధిత వివాదాలు, వ్యాపార వివాదాలు తదితర రాజీకి అవకాశం ఉన్న వివాదాలను మధ్యవర్తిత్వం ద్వారా పరిష్కరించుకునే అవకాశం ఉందన్నారు. కోర్టులో కేసు ఉన్న కక్షిదారులు జిల్లా న్యాయ సేవాధికార సంస్థను సంప్రదించి మధ్యవర్తిత్వం ద్వారా కేసును పరిష్కరించుకోవాలని కోరితే, నిబంధనల ప్రకారం మధ్యవర్తిని నియమించి ఇరు పక్షాలతోచర్చలుజరిపే అవకాశం కల్పిస్తామని తెలిపారు. అలాగే రాజీకి అవకాశం ఉన్న కేసులను న్యాయమూర్తి మధ్యవర్తిత్వానికి పంపవచ్చని, ఇరువర్గాలు కూడా విజ్ఞప్తి ద్వారా ఈ అవకాశాన్ని కోరవచ్చని తెలిపారు. మధ్యవర్తిత్వంకోరిన కక్షిదారులకు నిబంధనల ప్రకారం మధ్యవర్తిని నియమిస్తామని తెలిపారు. మధ్యవర్తి ఇరువర్గాలతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకుని, ఇద్దరికీ ఆమోదయోగ్యమైన పరిష్కారం కుదిరేలా సహకరిస్తారని వివరించారు. మధ్యవర్తిత్వ సమయంలో వెల్లడించిన విషయాలను ఒక పక్షానికి వ్యతిరేకంగా ఉపయోగించలేరని స్పష్టంచేశారు. దీంతో ఎలాంటి భయాందోళనలు లేకుండా తమ సమస్యలను మధ్యవర్తి ముందు వివరించుకునే అవకాశం ఉంటుందన్నారు. జిల్లాలో ఇప్పటి వరకు సుమారు 2,000 కేసులను మధ్యవర్తిత్వానికి అనుకూలమైనవిగా గుర్తించగా, 148 కేసులను ఇప్పటికే న్యాయమూర్తికి పంపించినట్లు తెలిపారు. అక్టోబర్ 1 నుంచి డిసెంబర్ 31 వరకునిర్వహించే ప్రచార కార్యక్రమంలోమరిన్ని కేసులను మధ్యవర్తిత్వానికి పంపించి, వీలైనన్ని కేసులను సత్వరంగాపరిష్కరించేలా చర్యలుతీసుకుంటామని వెల్లడించారు. దీంతో కక్షిదారులకు సమయం, ఖర్చు ఆదా కావడంతో పాటుఇరు పక్షాల మధ్య సత్సంబంధాలు కొనసాగుతాయని వివరించారు. కాబట్టి జోగులాంబ గద్వాల జిల్లా ప్రజలు కోర్టుల్లో కేసులు ఉన్నప్పుడు రాజీకి అవకాశం ఉన్న వివాదాలను మధ్యవర్తిత్వం ద్వారా పరిష్కరించుకునే అవకాశాన్ని సద్వి నియోగం చేసుకోవాలని సూచించారు.

## మండల వ్యాప్తంగా యథేచ్ఛగా ఇసుక దందా!

- అధికారుల కళ్లుగప్పి అర్థరాత్రి ఫిల్టర్ ఇసుక రవాణా


ఫిల్టర్ ఇసుక డంప్ చేసిన దృశ్యం


ఫిల్టర్ ఇసుక రవాణా చేస్తున్న దృశ్యం

**నవాబుపేట, సెప్టెంబరు29, ప్రభాతవార్త:** నవాబుపేట మండల పరిధిలో ఫిల్టర్ ఇసుక దందా యథేచ్ఛగా కొనసాగుతోంది. కారూరు, ఇప్పటూరు మల్లారెడ్డిపల్లి, చౌటపల్లి, అమ్మాపూర్, పోమల్, రాజాపూర్, ఫతేపూర్, చాకలిపల్లి తదితర గ్రామాల శివార్లలో ఉన్న దుందుభి వాగులో ఇసుకను అక్రమంగా సేకరించి, ఫిల్టర్ చేసి రాత్రివేళల్లో ట్రాక్టర్లు, ఇతర వాహనాల ద్వారాతరలిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. అధికారుల తనిఖీలకు చిక్కకుండా అర్ధరాత్రి సమయాల్లో ఇసుక రవాణా సాగిస్తున్నట్లు స్థానికులు చెబుతున్నారు.

**జర్నలిస్టులకు బెదిరింపులు:** ఇసుక అక్రమ రవాణాపై వార్తా కవరేజీ కోసం వెళ్లిన జర్నలిస్టులను కొందరు ఇసుక వ్యాపారులు బెదిరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. వాగుల్లో ఫొటోలు తీస్తే గుంతల్లోకి వేసి జేసీబీలతో మట్టి పోస్తామని బెదిరించినట్లు సమాచారం. సమాజంలో జరుగుతున్న అక్రమ దందాలను వెలుగులోకి తీసుకు వచ్చేందుకు ప్రయత్నించే జర్నలిస్టులను బెదిరించడం పట్ల ప్రజాస్వామ్య వాదులుఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇలాంటి ఘటనలపై పోలీసులు విచారణ జరిపి, నిజానిజాలను తేల్చాలని కోరుతున్నారు. మండలంలోని అనుమానిత ఫిల్టర్ ఇసుక తయారీ ప్రాంతాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి, రాత్రివేళల్లో తనిఖీలు నిర్వహించాలని స్థానికులు కోరు తున్నారు. అక్రమ ఇసుక రవాణా నిజమేనని తేలితే సంబంధిత వ్యక్తులు, వాహనాలపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

## అధికారులతో రైతులు వాగ్వాదం!

**భారత్ మాల రహదారి భూములకు సరైన ధర ప్రభుత్వం నిర్ణయించక పోవడంతో అడ్డుకున్న రైతులు**


పనులను అడ్డుకున్న రైతులు, పర్యవేక్షణ చేస్తున్న అధికారులు

**మాగనూర్, సెప్టెంబరు 29 ప్రభాతవార్త :** మండల కేంద్రం మాగనూర్ గుండా నిర్మించనున్న భారత్ మాల రహదారి నిర్మాణ భూముల్లో అధికారులు రైతులపై దౌర్జన్యానికి దిగుతున్నారని రైతులు మండిపడుతున్నారు. మాగనూర్ బైపాస్ కోసం సేకరించిన భూములకు సరైన ధర ప్రభుత్వం నిర్ణయించక పోవడంతో బాధిత రైతులు ఇటీవల కోర్టును ఆశ్రయించినట్లు తెలిపారు. బాధితుల విన్నపంలో న్యాయం ఉండడాన్ని గమనించిన కోర్టు తమ పొలానికి స్టే ఆర్డర్ ఇచ్చినట్లు అధికారులకు చెప్పారు. ఆర్డర్ ప్రకారం బైపాస్ భూముల్లో ఎలాంటి పనులు చేపట్టకూడదని స్పష్టంగా ఉన్నప్పటికీ అధికారులు దౌర్జన్యంగా పనులు చేసేందుకు గత వారం రోజులుగా ప్రయత్నాలు చేస్తున్నారని అసహనం వ్యక్తం చేశారు. ఇదే క్రమంలో మంగళవారం కూడా రెవెన్యూ, ఎన్‌హెచ్ఎ అధికారులు పెద్ద సంఖ్యలో మాగనూర్, మక్తల్, ఉట్కూర్ నారాయణపేట్ స్టేషనుల కు చెందిన పోలీసులను వెంట తీసుకొని వచ్చి సర్వే నంబర్ 183, 184 సర్వే నంబర్లలో పనులను మొదలుపెట్టే ప్రయత్నం లోనే రైతులు అడ్డుకున్నారు. ఇదే విషయమై బాధిత రైతులు మంగళవారం ఉదయం స్థానిక ఎమ్మార్వో, పోలీసులకు కోర్టు స్టేఆర్డర్ కాపీలను అందించారు. తమ పొలాల్లో ఎలాంటి పనులు చేపట్టకూడదని విన్నవించుకున్నప్పటికీ అధికారులు దౌర్జన్యంగా పొలాల పైకి రావడం ఏమిటని ప్రశ్నిస్తూ, అధికారులను వ్యతిరేకించే స్థాయి రైతులకు లేదని, రైతులకు న్యాయం జరిగే వరకు సమన్వయంతో సహకరించాలని అధికారుల ను రైతులు కోరారు. రైతుల న్యాయమైన డిమాండ్‌ను కాదని పనులు మొదలుపెడితే రైతుల శవాలపైనే రోడ్డు వేయాలని రైతులు వాగ్వాదానికి దిగడంతో చేసేదిలేక అధికారులు వెను తిరిగారు.

## ప్రజా ఆరోగ్య పరిరక్షణకు ఐక్యత ఫౌండేషన్ స్వచ్ఛ జలధార కార్యక్రమం


స్వచ్ఛ జలధార పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

**వెల్దండ, సెప్టెంబర్29 ప్రభాతవార్త:** ప్రజలకు పరిశుభ్రమైన త్రాగునీరు అందించాలనే లక్ష్యంతో ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి సహకారంతో చేపట్టిన స్వచ్ఛ జలధార కార్యక్రమం 2వ విడతలో భాగంగా మంగళవారం మండలంలోని అజిలాపూర్ గ్రామంలో జర్మన్ సాంకేతికతతో 5 త్రాగునీటి నిల్వ ట్యాంకులను పరిశుభ్రపరిచారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణతో పాటు త్రాగునీటి నాణ్యతను మెరుగుపరచాలనే ఉద్దేశంతో స్వచ్ఛ జలధార" కార్యక్రమాన్ని కల్వకుర్తి నియోజకవర్గంలోని గ్రామాల్లో దశలవారీగా కొనసాగించనున్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యం, సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి చేపడుతున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమన్నారు. ముఖ్యంగా పరిశుభ్రమైన త్రాగునీరు అందించాలనే ఉద్దేశంతో స్వచ్ఛ జలధార" కార్యక్రమం ద్వారా గ్రామాల్లోని నీటి నిల్వ ట్యాంకులను శాస్త్రీయ పద్ధతిలో పరిశుభ్రపరచడం ఎంతో ఉపయోగకరమైన కార్యక్రమమన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ లక్ష్మయ్య, ఉప సర్పంచ్ గణేష్, ఐక్యత ఫౌండేషన్ గ్రామ ప్రతినిధులు, వార్డు సభ్యులు, యువకులు, ఉన్నారు.

## శ్రీరంగాపూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏబీవీపీ నూతన కార్యవర్గం ఎన్నిక


ఎబివిపి నూతన కార్యవర్గం

**శ్రీరంగాపురం, సెప్టెంబరు 29 ప్రభాతవార్త :** శ్రీరంగాపూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం అఖిల భారతీయ విద్యార్థి పరిషత్తు నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కళాశాల విద్యార్థుల సమక్షంలో నిర్వహించిన కార్యక్రమంలో నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న వనపర్తి జిల్లా కన్వీనర్ దేవర్ల కార్తీక్ మాట్లాడుతూ ఏబీవీపీ 1949 జూలై 9న కేవలం ఐదుగురు విద్యార్థులతో ప్రారంభమైన అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ నేడు ప్రపంచంలోనే అతిపెద్ద విద్యార్థి సంఘంగా ఎదిగిందన్నారు విద్య సామాజిక జాతీయ అంశాల పైన అనేక ఉద్యమాలకు ఏబీవీపీ నాయకత్వం వహించిందని తెలిపారు నక్సలిజానికి వ్యతిరేకంగా పోరాటంలో దాదాపు 44 మంది ఏబీవీపీ కార్యకర్తలు వీర మరణం పొందారని పేర్కొన్నారు. కాశ్మీర్లో ఉగ్రవాదులకు సవాల్ విసురుతూ లాల్ చౌకులో జాతీయ పతాకాన్ని ఏబీవీపీ కార్యకర్తలే ఎగరవేశారు అని తెలిపారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు. శ్రీరంగాపురం మండల కన్వీనర్ గా కేనందు మండల కో కన్వీనర్ గా మాసూమ్ నగర కార్యవర్గ సభ్యులుగా కళ్యాణ్ శివప్రసాద్ అసిఫ్ పాషా తేజ అర్జున్ చంద్రులను మండల నూతన కార్యవర్గంగా నియమించడం జరిగింది. నూతనంగా ఎన్నికైన నాయకులు మాట్లాడుతూ విద్యార్థుల సమస్యలను తెలుసుకొని వాటి పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు ఈ కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలలో రజత పతకం సాధించిన న్యూ బీసీ గురుకుల విద్యార్థి



**మక్తల్, సెప్టెంబరు 29 ప్రభాతవార్త:** రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలలో మఖ్తల్ న్యూ బీసీ గురుకుల విద్యార్థి ప్రతిభ చాటాడు. హన్మకొండలో జరిగిన రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలలో మహాత్మా జ్యోతిబా పూలే మఖ్తల్ న్యూ గురుకుల బాలుర కళాశాల విద్యార్థి రవీందర్ పాల్గొని షాట్ పూట్‌లో రజత పతకాన్ని సాధించాడు. ఈ సందర్భంగా విద్యార్థిని పాఠశాల ప్రిన్సిపాల్ రాములు, ఏటిపి మహేష్ సత్యనారాయణ, ఉపాధ్యాయ బృందం అభినందించారు. విద్యార్థి విజయానికి కృషి చేసిన పీఈటీలు నవీన్, ఇబ్రహీం, కోచ్ జగదీష్ లను ప్రిన్సిపాల్ ప్రత్యేకంగా అభినందించారు. రాష్ట్ర స్థాయిలో పతకం సాధించడం పట్ల పాఠశాల విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు.

## రాష్ట్ర స్థాయి సైక్లింగ్ పోటీలలో సత్తా చాటిన నారాయణపేట జిల్లా బాలికలు


సైక్లింగ్ పోటీలలో సత్తా చాటిన బాలికలు

**మక్తల్, సెప్టెంబరు 29 ప్రభాతవార్త:** నిజామాబాద్ జిల్లా కేంద్రం కంటేశ్వర్ బైపాస్ రోడ్డులో ఈ నెల 27, 28 తేదీలలో నిజామాబాద్ సైక్లింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన అస్మితా ఖేలో ఇండియా ఉమెన్స్ 10 కిలోమీటర్ల రోడ్డు ఆర్డినరీ మాస్ సైక్లింగ్‌పోటీలలో నారాయణపేటజిల్లా బాలికలు అద్భుత ప్రతిభ కనబరిచారు. తెలంగాణ రాష్ట్రం నుండి 434 మంది బాలికలు, మహిళలు పాల్గొన్న ఈ పోటీలలో నారాయణపేట జిల్లా నుండి 22 మంది బాలికలు పాల్గొన్నారు. ఇందులో నర్వకు చెందిన బాలికలు పతకాలు సాధించారు. 16 సంవత్సరాలలోపు విభాగంలో సి.చందు రజత పతకం, టి. సౌజన్య కాంస్య పతకం, 14 సంవత్సరాలలోపు విభాగంలో జి. నందిని కాంస్య పతకం, సి. అఖిల 4వ స్థానం, 18 సంవత్సరాలలోపు విభాగంలో సి. జ్యోతి రజత పతకం సాధించినట్లు జిల్లా ప్రధాన కార్యదర్శి బి. గోపాలం తెలిపారు. రాష్ట్ర స్థాయిలో పతకాలు సాధించిన సైక్లింగ్ రైడర్లకు నిజామాబాద్ జిల్లా సీనియర్ సివిల్ జడ్జి నీలిమ, డాక్టర్ కవితారెడ్డి, రాష్ట్ర కార్యదర్శి బి. విజయ కాంతారావు, ఇండియా కోచ్‌అబ్జర్వర్ డాక్టర్ మాక్స్‌వెల్, అధ్యక్షుడు కృపాకర్‌రెడ్డి పతకాలు, ధ్రువపత్రాలు అందజేసి అభినందించారు. పతకాలు సాధించిన బాలికలను నారాయణపేట జిల్లా సైక్లింగ్ చైర్మన్ డాక్టర్ మణికంఠగౌడ్, అధ్యక్షుడు తాన్ సింగ్, కార్యదర్శి బి.గోపాలం, ఉపాధ్యక్షుడు జి.శివకుమార్ అభినందించారు.

## సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యలకు నిరసనగా దిష్టిబొమ్మ దహనం

**మక్తల్, సెప్టెంబరు 29 ప్రభాతవార్త:** సీఎం రేవంత్ రెడ్డి హిందూ దేవతలపై చేసిన వ్యాఖ్యలకు నిరసనగా మక్తల్ మండల కేంద్రంలో బీజేపీ ఆధ్వర్యంలో రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి బలరాం రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం గత 75 సంవత్సరాలుగా మతాల పేరుతో, కులాల పేరుతో ప్రజలను విడదీస్తూ పాలన సాగిస్తోందని విమర్శించారు. చివరకు దేవతలను కూడా ధనిక, పేద అనే భావనతో విడదీయడం కాంగ్రెస్‌ప్రభుత్వ దిగజారుడుతనానికి నిదర్శనమని, ఇది సిగ్గుచేటని అన్నారు. ఇదే విధంగా వ్యవహరిస్తే బీజేపీ చూస్తూ ఊరుకోదని, హిందూ సమాజంలో చైతన్యం నింపి రాబోయే రోజుల్లో కాంగ్రెస్ ప్రభుత్వానికి తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి బలరాంరెడ్డి, కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు వెంకట్ రాములు, మక్తల్ మండల అధ్యక్షుడు ప్రతాప్ రెడ్డి, మాగనూరు మండల అధ్యక్షుడు జయనాథ్ రెడ్డి, కృష్ణ మండల అధ్యక్షుడు నరసప్ప, కావాలి వెంకటేష్, ఆడం సత్యనారాయణ, రాఘవేందర్, చీరాల సత్యనారాయణ, మంతన్ గౌడ్, శంకర్, మల్లేష్, నరేందర్, సాగర్, లింగంపల్లి లక్ష్మణ్, బట్టి మహాదేవ్, బీజేపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## నూతన మార్కెట్‌లో చేపల అమ్మకానికి స్థలం కేటాయించాలి

- మంత్రి శ్రీహరికి బీసీ సేన వినతి



**మక్తల్, సెప్టెంబరు 29 ప్రభాతవార్త:** మక్తల్‌లో నూతనంగా ఏర్పాటు చేస్తున్న చికెన్, మటన్ మార్కెట్‌లో తమకు కూడా చేపలు అమ్ముకోవడానికి స్థలం కేటాయించాలని బీసీ సేన ఆధ్వర్యంలో మత్స్యకారులు మంత్రి డా. వాకిటి శ్రీహరికి వినతి పత్రం అందజేశారు. మల్టీ పర్పస్ మార్కెటింగ్‌సహకార సంఘం రిజిస్టర్ నం.వి36 05072023లో 49 మంది సభ్యులు ఉన్నారని, తమకు ఎలాంటి జీవనఉపాధి లేదనివారు పేర్కొన్నారు. గత 3 సంవత్సరాల నుండి తమకు ఎలాం టి సబ్సిడీ వసతులులభించలేదని తెలిపారు. ఈ విషయమై నారాయణపేట జిల్లా బీసీ సేన అధ్యక్షుడు సెలేటి వెంకటేష్ ముదిరాజ్‌ను కలవగా, మంత్రికి వినతి పత్రంఇవ్వాలని సూచించారని తెలిపారు. కావున నూతనమార్కెట్‌లో తమకు స్థలం కేటాయించి ఆదుకోవాలని కోరారు. ఈ వినతి పత్రంపై 9 మంది డైరెక్టర్లు గిరిశెవెంకటప్ప, శివఉప్పలప్ప, కొండన్న, నర్సింహ, కేశప్ప, అంజయ్య, ఎల్లప్ప, రమేష్, రాములు తదితరులు సంతకాలు చేశారు.

## ఎరువుల విక్రయాల్లో నిబంధనలు పాటించాలి

**మద్దూరు, సెప్టెంబరు29 ప్రభాతవార్త :** ఎరువుల డీలర్లు ఎఫ్‌సీఓ-1985 నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని మద్దూర్ మండల వ్యవసాయ అధికారి ప్రవీణ్‌కుమార్ సూచించారు. మంగళవారం మద్దూర్ పట్టణంలోని వివిధ ఎరువుల దుకాణాలను తనిఖీ చేసి నిల్వలు, రికార్డులు, ధరలు, బిల్లులను పరిశీలించారు. నిర్ణీత ధరలకే ఎరువులు విక్రయించి రైతులకు బిల్లుఇవ్వాలని తెలిపారు. అధిక ధరలు, నాణ్యత లేని ఎరువుల విక్రయం, నిబంధనల ఉల్లంఘనలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రైతులకు తప్పనిసరిగా బిల్లు ఇవ్వాలని సూచించారు.

## చలో చిట్యాల కార్యక్రమం వాయిదా

**మక్తల్, సెప్టెంబరు 29 ప్రభాతవార్త:** సత్యంగౌడ్ జైల్లో ఉండడం, మారుతిగౌడ్ పరారీలో ఉండడం కారణంగా అక్టోబర్ రెండున తలపెట్టిన చలో చిట్యాల కార్యక్రమాన్ని వాయిదా వేస్తున్నట్లు బాధిత మహిళ, దళిత ప్రజాసంఘాల ఐక్యవేదిక ప్రకటించింది. ఈ మేరకు మంగళవారం వారు పత్రికా ప్రకటన విడుదల చేశారు. ప్రకటనలో వారు పేర్కొన్న వివరాలు ఇలా ఉన్నాయి. సెప్టెంబర్ పదహారున మఖ్తల్ ఆర్ అండ్ బిగెస్ట్ హౌస్‌లో ప్రజాసంఘాల ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించి, బాధిత మహిళకు న్యాయం చేయాలని కోరుతూ అక్టోబర్ రెండున చలో చిట్యాల కార్యక్రమాన్ని ప్రకటించామని తెలిపారు. అయితే ప్రస్తుతం సత్యంగౌడ్ జైల్లో ఉండడం, మారుతిగౌడ్ అందుబాటులో లేకపోవడం వల్ల కార్యక్రమాన్ని వాయిదా వేస్తున్నామని పేర్కొన్నారు. సత్యం గౌడ్ జైలు నుంచి బయటకు వచ్చిన తర్వాత, మారుతి గౌడ్ అందుబాటులోకి వచ్చిన తర్వాత బాధిత మహిళను వారి ఇంటికి తీసుకెళ్లేందుకు సిద్ధంగా ఉన్నామని వారు తెలిపారు. సత్యంగౌడ్‌కు పునరాలోచించుకునే అవకాశం ఇవ్వాలనే ఉద్దేశంతోనే ఈ నిర్ణయం తీసుకున్నామని వివరించారు. కుల నిర్మూలన పోరాట సమితి జిల్లా అధ్యక్షులు డి చంద్రశేఖర్, అంబేద్కర్ యువజనసంఘం అధ్యక్షులు పృథ్వీరాజ్, మానవ హక్కుల కార్యకర్త మద్దిలేటి, దళిత ఉద్యమ నాయకులు జీర్గల్ నాగేష్ మాదిగ, బుడగ జంగాల హక్కుల పోరాట సమితి రాష్ట్ర కార్యదర్శి కళ్యాణం రాజు ఉన్నారు.

## జవహర్ నవోదయ విద్యాలయ అభివృద్ధికి

# పీఎం శ్రీ నిధులను సద్వినియోగం చేయాలి

**- నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్**



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, సెప్టెంబర్ 29 ప్రభాతవార్త:** నాగర్‌కర్నూల్ జిల్లా వట్టెం జవహర్ నవోదయ విద్యాలయంలో విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణం, ఆధునిక మౌలిక సదుపాయాలు కల్పించడంతో పాటు పాఠశాల సమగ్ర అభివృద్ధికి పీఎం శ్రీ పథకం కింద అందుబాటులో ఉన్న నిధులను సమర్థవంతంగా సద్వినియోగం చేయాలని జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ సూచించారు. మంగళవారం నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ అధ్యక్షతన జవహర్ నవోదయ విద్యాలయ పాఠశాల మేనేజ్‌మెంట్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల అభివృద్ధి, విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలు, పీఎం శ్రీ పథకం కింద చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, నిధుల వినియోగం తదితర అంశాలపై పాఠశాల ప్రిన్సిపల్ బి. పూర్ణిమను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడంతో పాటు సాంకేతిక పరిజ్ఞానం, సృజనాత్మకత, వివిధ నైపుణ్యాలను పెంపొందించేలా పాఠశాలలో అవసరమైన మౌలిక సదుపాయాలను మరింత బలోపేతం చేయాలని, పీఎం శ్రీ పథకంద్వారా పాఠశాలలకు అందుబాటులో ఉన్న నిధులను విద్యార్థులకు ప్రత్యక్షంగా ఉపయోగపడే అభివృద్ధి కార్యక్రమాలకు ప్రాధాన్యతనిస్తూ పారదర్శకంగా, సమర్థవంతంగా వినియోగించాలని ఆదేశించారు. విద్యార్థుల్లో సంగీతంపై ఆసక్తిని పెంపొందించేందుకు మ్యూజిక్ టీచర్ నియామక ప్రక్రియ పూర్తయిందా లేదా అనే అంశంపై ప్రిన్సిపల్‌ను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు విద్యతో పాటు సంగీతం, కళలు, క్రీడలు తదితర రంగాల్లోనూ నైపుణ్యాలను పెంపొందించే అవకాశాలు కల్పించాలని సూచించారు. నాగర్‌కర్నూల్ జిల్లాలోని ప్రముఖ పర్యాటక, చారిత్రక, ప్రకృతి అందాలకు సంబంధించిన ప్రదేశాలను జవహర్ నవోదయ విద్యాలయ విద్యార్థులు సందర్శించేలా అవసరమైన ఏర్పాట్లు కల్పించనున్నట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు. తరగతి గది విద్యతో పాటు జిల్లాలోని చారిత్రక, సాంస్కృతిక, ప్రకృతి వైవిధ్యాన్ని విద్యార్థులు ప్రత్యక్షంగా తెలుసుకునే అవకాశం కల్పించడం ద్వారా వారి విజ్ఞాన పరిధిని విస్తరించవచ్చని, విద్యార్థుల విద్యాభ్యాసానికి సాంకేతిక పరిజ్ఞానం మరింత అందుబాటులోకి తీసుకురావాలనే ఉద్దేశంతో పాఠశాలకు అవసరమైన 20 కంప్యూటర్లను జిల్లా కలెక్టర్ మంజూరు చేశారు. కంప్యూటర్ విద్య ద్వారా విద్యార్థుల్లో డిజిటల్ నైపుణ్యాలనుపెంపొందించి, ఆధునిక విద్యా విధానాలకు అనుగుణంగా వారిని తీర్చిదిద్దాలని సూచించారు. పాఠశాలలో విద్యార్థులకు అవసరమైన మౌలిక సదుపాయాలు, తాగునీరు, పారిశుద్ధ్యం, విద్యావనరులు తదితర అంశాలపై కూడా సమావేశంలో చర్చించారు. విద్యార్థుల అవసరాలను గుర్తించి ప్రాధాన్యత క్రమంలో పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. 11వ, 12వ తరగతి విద్యార్థులకు ఐఐటీ ప్రవేశ పరీక్షల కోసం ప్రత్యేక బోధనా కార్యాచరణను రూపొందించి అమలు చేయాలని జిల్లా కలెక్టర్ సూచించారు. విద్యార్థుల సామర్థ్యాలను గుర్తించి వారికి అవసరమైన అదనపు బోధన, మార్గదర్శకత్వం అందించేలా ప్రణాళిక రూపొందించాలని సూచించారు. పాఠశాలలో విద్యార్థుల పరీక్షల ఉత్తీర్ణత శాతాన్ని మరింత పెంచేలా తరగతుల వారీగా ఫలితాలను విశ్లేషించి, అవసరమైన కార్యాచరణ ప్రణాళిక రూపొందించి అమలు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. విద్యార్థుల విద్యా ప్రమాణాలను మెరుగుపరచడంతో పాటు వారి ప్రతిభను వెలికితీసేందుకు విద్యా, సాంస్కృతిక, క్రీడా, సాంకేతిక కార్యక్రమాలకు సముచిత ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. వచ్చే విద్యా సంవత్సరానికి 6వ, 9వ, 11వ తరగతుల్లో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీ కోసం కొనసాగుతున్న నమోదు ప్రక్రియపై కూడా జిల్లా కలెక్టర్ ఆరా తీశారు. ఈ నెల 30వ తేదీ వరకు ఉన్న నమోదు గడువులోగా అర్హులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకునేలా విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. ఖాళీ సీట్లు మిగలకుండా నమోదు ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలోజిల్లా విద్యాశాఖ అధికారి ఏ.రమేష్ కుమార్, జవహర్ నవోదయ విద్యాలయ ప్రిన్సిపల్ బి.పూర్ణిమ, పాఠశాల సీనియర్ ఉపాధ్యాయుడు ఎస్. బాలాజీ నాయక్, డీఈ శిరీష్, డాక్టర్ సృజన, పేరెంట్స్ కమిటీ సభ్యులు రవికుమార్, ఎం. రాజు తదితరులు పాల్గొన్నారు.



## ఆసుపత్రి నిర్మాణ పనులను పరిశీలించిన ఎమ్మెల్యే

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, సెప్టెంబర్ 29 ప్రభాతవార్త:** నాగర్‌కర్నూల్ పట్టణంలో మెడికల్ కళాశాలకు అనుబంధంగా 10 ఎకరాల విస్తీర్ణంలో రూ.235 కోట్ల అంచనా వ్యయంతో నిర్మిస్తున్న 550 పడకల ఆసుపత్రి నిర్మాణ పనులను ఎమ్మెల్యే డా. కూచుకుళ్ల రాజేష్ రెడ్డి పరిశీలించారు. ఆసుపత్రి నిర్మాణపనుల పురోగతిని అధికారులను, నిర్మాణ సంస్థ ప్రతినిధులను అడిగి తెలుసుకున్నారు. పనులను వీలైనంత త్వరగా పూర్తి చేసి ఆసుపత్రిని ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని నిర్మాణ సంస్థ ప్రతినిధులకు సూచించారు. నిర్మాణ పనుల్లోనాణ్యత విషయంలో ఎక్కడా రాజీ పడకూడదనిఎమ్మెల్యే స్పష్టం చేశారు. పనులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ నిర్దేశిత ప్రమాణాల ప్రకారం నిర్మాణం జరిగేలా చూడాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. 550 పడకల ఆసుపత్రి అందుబాటులోకి వస్తే నాగర్‌కర్నూల్ జిల్లా ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి రానున్నాయని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రమణ రావు, మెడికల్ కళాశాల సూపరింటెండెంట్ శ్రీనివాసులు, నాయకులు కృష్ణారెడ్డి, అమృత రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## కళ్యాణ లక్ష్మి, సిఎంఆర్ నిరుపేదల పాలిట వరం

**-నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే డాక్టర్ రాజేష్ రెడ్డి**



సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, సెప్టెంబర్ 29 ప్రభాతవార్త:** కళ్యాణ లక్ష్మి, సీఎం సహాయనిధి చెక్కులు నిరుపేదల పాలిట ఒక వరమని ఎమ్మెల్యే డాక్టర్ రాజేష్ రెడ్డి అన్నారు. మంగళవారం నాగర్‌కర్నూల్ క్యాంప్ కార్యాలయంలో లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి చెక్కులతో పాటు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి మాట్లాడుతూ పేదింటి ఆడబిడ్డ పెళ్లి భారం కాకూడదని ఉద్దేశంతో ప్రభుత్వం ఆడపిల్లలకు అండగా ఉంటూ కళ్యాణ లక్ష్మి చెక్కుల ద్వారా ఆ కుటుంబాన్ని ఆదుకోవడం జరుగుతుందని హర్షం వ్యక్తం చేశారు. అదేవిధంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతూ వివిధ ప్రవేట్ ఆసుపత్రిలో వైద్యం చేయించుకున్న నిరుపేదలకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు ఒక సంజీవిని అని ఎమ్మెల్యే రాజేషరెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రమణరావు, మున్సిపల్ చైర్మన్ తీగల సునేంద్ర, ఎమ్మార్వో తబితా రాణి, వైస్ చైర్మన్ బాదం రమేష్, పట్టణ అధ్యక్షులు జక్కా రాజ్ కుమార్, కౌన్సిలర్లు నాయకులు పాల్గొన్నారు.

## కల్వకుర్తి పోలీస్ స్టేషన్‌లో డీఎస్పీ వార్షిక తనిఖీ



రికార్డులను పరిశీలిస్తున్న కల్వకుర్తి డీఎస్పీ వెంకట్‌రెడ్డి

**కల్వకుర్తి, సెప్టెంబర్ 29 ప్రభాతవార్త:** వార్షిక తనిఖీల్లో భాగంగా కల్వకుర్తి డీఎస్పీ వెంకట్‌రెడ్డి మంగళవారం కల్వకుర్తి పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్‌లో నిర్వహిస్తున్న వివిధ రికార్డులను, పెండింగ్‌లో ఉన్న కేసుల వివరాలను పరిశీలించారు. కేసుల దర్యాప్తు పురోగతి, రికార్డుల నిర్వహణ తదితర అంశాలను ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా డీఎస్పీ వెంకటరెడ్డి మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణలో నిరంతరం అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు. పోలీస్ సిబ్బంది విధుల నిర్వహణ, స్టేషన్‌లోని రికార్డుల నిర్వహణపై సంబంధిత అధికారులకు సూచనలు చేశారు. కల్వకుర్తి ఎస్ఐ కురుమూర్తి విధుల పట్ల సంతృప్తి వ్యక్తం చేసి అభినందించారు.

## అంగన్‌వాడీ టీచర్లు, ఆశా వర్కర్లకు సన్మానం



**కృష్ణ, సెప్టెంబరు29 ప్రభాతవార్త:** సేవా సంకల్ప అభియాన్ కార్యక్రమంలో భాగంగా ఆలంపల్లి గ్రామ బీజేపీ యువ నాయకులు, అంగన్‌వాడీ టీచర్లు, ఆశా వర్కర్లను ఘనంగా సన్మానించారు. చిన్నారులు, గర్భిణీలు, బాలింతలకు పౌష్టికాహారం, ఆరోగ్య సేవలు అందించడంలో వారు చేస్తున్న కృషిని వారు అభినందించి ఈ సందర్భంగా మాట్లాడారు. చిన్నారుల సంరక్షణ, పోషకాహారం, ఆరోగ్య అవగాహనతో పాటు గ్రామీణ ప్రజలకు వైద్య సేవలపై అవగాహన కల్పించడంలోవారిపాత్ర కీలకమని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ ప్రధానమంత్రి సంక్షేమ పథకాలు, కార్యక్రమాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రజల ఆరోగ్యం, సంక్షేమం కోసం అంకిత భావంతో పనిచేస్తున్న అంగన్‌వాడీ టీచర్లు, ఆశా వర్కర్ల సేవలను గుర్తించి శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో బిజెపి నాయకులు కాంద్రాయి తిప్పన్న, బిలార్ బస్వంత్ కాంద్రాయరాజు, కవాలిబస్వరాజ్, కంద్రాయ అంబ్రేష్, బి.శశికుమార్, ఎం.వెంకటేష్, బంగి మల్లేష్, రఘువీర్, బి.వెంకటేష్ గ్రామ ప్రజలు, యువత, అంగన్‌వాడీ సిబ్బంది, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

# హిందువులందరూ సనాతన ధర్మాన్ని కాపాడాలి

- **విశ్వహిందూ పరిషత్ జిల్లా అధ్యక్షులు మద్ది యాదిరెడ్డి**



మాట్లాడుతున్న విహెచ్‌పి నాయకులు

**అడ్డాకుల, సెప్టెంబరు29 ప్రభాతవార్త:** జైశ్రీరామ్ విశ్వహిందూ పరిషత్ పాలమూరు జిల్లా లో గల పొన్నకల్ గ్రామం అడ్డాకుల మండలం ఆంజనేయస్వామి దేవాలయంలో హనుమాన్ చాలీసా వందవారాల పారాయణాన్ని పురస్కరించుకొని హనుమాన్ చాలీసా ప్రాశస్త్యం పారాయణ ఫలితాలను తెలియజేసేందుకు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా మద్ది యాదిరెడ్డి హాజరయ్యారు. విశ్వహిందూ పరిషత్ జిల్లా అధ్యక్షులు మాట్లాడుతూ ధర్మో రక్షతి రక్షితః అని చెబుతూ హిందువులందరూ సనాతన ధర్మాన్ని కాపాడినట్లయితే ఆధర్మం హిందువులను కాపాడుతుంది, అని చెబుతూ ఈ కార్యక్రమం సనాతన ధర్మం పట్ల గ్రామస్తులకు గల చైతన్యాన్ని తెలియపరుస్తుందని ఇటువంటి కార్యక్రమాలు జరపడం ఎంతో ఆనందదాయకం అన్నారు. మన సనాతనహిందూ బంధువులు అందరికీ మార్గదర్శనంగా నిలుస్తుందని చెప్పారు. అదేవిధంగా ఈ కార్యక్రమానికి ముఖ్య వ్యక్తగా విచ్చేసిన ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డి మాట్లాడుతూ పొన్నకల్లు అంటే బంగారు రాయి ఈ గ్రామంలో గల ప్రజలు బంగారం లాంటి స్థిరమైన మనసున్న వారు ఇటువంటి కార్యక్రమం ఏర్పాటు చేయడం ఎంతో స్ఫూర్తిదాయకం అని చెబుతూ ఆంజనేయుడు చెడుపైన విజయం సాధించే బలాన్ని ప్రజలకు ఇచ్చి సనాతన ధర్మాన్ని పాటిస్తూ ధర్మం వీడకుండా ఉండాలని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో సురేష్ రెడ్డి, సతీష్ రెడ్డి, నాగార్జున రెడ్డి, విజయ్ కుమార్‌రెడ్డి, లింగారెడ్డి రాచాలజనార్ధన్, విశ్వ హిందూ పరిషత్ జిల్లా కార్యదర్శి నాగరాజ్ మొదలగు వారుపాల్గొన్నారు.

# బొటానికల్ గార్డెన్‌ను సందర్శించిన ఏకలవ్య కళాశాల విద్యార్థులు



బొటానికల్ గార్డెన్‌ను సందర్శించిన విద్యార్థులు

**జడ్చర్ల, సెప్టెంబరు 29, ప్రభాతవార్త :** జడ్చర్లలోని డా. బూర్గుల రామకృష్ణారావు ప్రభుత్వ డిగ్రీ కళాశాల, జడ్చర్లలో అభివృద్ధి చేస్తున్న తెలంగాణ బొటానికల్ గార్డెన్‌ను బాలానగర్ మండల కేంద్రంలోని ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ కళాశాలకు చెందిన ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం బైపీసీ విద్యార్థులు సందర్శించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్, గార్డెన్ సమన్వయకర్త విద్యార్థులకు స్వాగతం పలికి తెలంగాణ బొటానికల్ గార్డెన్‌ఏర్పాటు, అభివృద్ధి, ప్రాధాన్యత గురించి వివరించారు. గార్డెన్ సమన్వయకర్త డా. బి. సదాశివయ్య గార్డెన్‌లోని వివిధ విభాగాలను విద్యార్థులకు చూపిస్తూ వివిధ రకాలమొక్కలు, ఔషధ మొక్కలు, వాటిపై ఆధారపడి జీవించే కీటకాలు, ముఖ్యంగా సీతాకోకచిలుకలు, వివిధ రకాల పక్షులు, వాటి గుర్తింపు లక్షణాలను వివరించారు. అదేవిధంగా ఎర్రచందనం, శ్రీగంధం, మహాగని, టేకు వంటి విలువైన కలప జాతుల ప్రాధాన్యత, కలప విలువ, వాటిని రైతులు సాగు చేయడం ద్వారా పొందే ఆర్థిక ప్రయోజనాలనువిద్యార్థులకు వివరించారు. అనంతరం జీవ వైవిధ్య సంరక్షణ, విద్యా కేంద్రంలో సంరక్షిస్తున్న వివిధ రకాలపాములను విద్యార్థులకు చూపించి, వాటి గుర్తింపు లక్షణాలు, విషపూరిత మరియు విషరహిత పాముల మధ్య తేడాలు, పాముకాటు వల్ల కలిగే లక్షణాల గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలోఏకలవ్య మోడల్ కాలేజీ అధ్యాపకులు వినయ్, కిరణ్, పరిశోధక విద్యార్థులు, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు.



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

# రైతుల సంక్షేమమే సహకార సంఘం లక్ష్యం

- రుణ బకాయిలు సకాలంలో చెల్లించాలి
- సింగిల్ విండో అధ్యక్షులు విష్ణువర్ధన్ రెడ్డి



మాట్లాడుతున్న సింగిల్ విండో అధ్యక్షులు విష్ణువర్ధన్ రెడ్డి

**పెద్దమందడి, సెప్టెంబరు 29 ప్రభాతవార్త:** రైతుల సంక్షేమమే ధ్యేయంగా సహకార సంఘం పనిచేస్తుందని వనపర్తి జిల్లా పెద్దమందడి మండలం వ్యవసాయ సహకార సంఘం అధ్యక్షుడు విష్ణువర్ధన్ రెడ్డి అన్నారు. పెద్దమందడి సహకార సంఘం కార్యాలయంలో నిర్వహించిన సర్వసభ్య సమావేశానికి ఆయనఅధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా విష్ణువర్ధన్ రెడ్డి మాట్లాడుతూ రైతులకు అవసరమైన విత్తనాలు ఎరువులు, రుణాలు తదితర సేవలను సకాలంలో అందించేందుకు సహకార సంఘం నిరంతరం కృషి చేస్తుందన్నారు. రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. సహకార సంఘం బలోపేతానికి సభ్యులందరూ సహకరించాలని కోరారు. రైతులు సహకార సంఘం నుంచి తీసుకున్న రుణబకాయిలను సకాలంలో చెల్లించాలని సూచించారు. రుణబకాయలు పేరుకుపోకుండా సభ్యులు బాధ్యతగా వివరించాలని కోరారు. అలాగే వ్యాపార రుణాలకు సంబంధించిన బకాయిల వసూలు ప్రక్రియను వేగవంతం చేయాలని అన్నారు. వరి కొనుగోలు ప్రక్రియపై కూడా సమావేశంలో చర్చించారు. సింగిల్ విండో సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసే వరి కొనుగోలు కేంద్రాల్లోని రైతులు తమ ధాన్యాన్ని విక్రయించుకోవాలని సూచించారు. రైతులు అందుబాటులో ఉండే విధంగా సంఘం కార్యకలాపాలను మరింత విస్తరించడంతోపాటు సభ్యులకు మెరుగైన సేవలు అందించేందుకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. రైతుల అభివృద్ధి సంఘం పురోగతి పరస్పరం ముడిపడి ఉన్నాయని రైతులకు ప్రయోజనం చేకూరే విధంగా ప్రతి నిర్ణయంఉండాలని అన్నారు. సంఘం ముఖ్య కార్యనిర్వాహణ అధికారి సీఈఓ సుధాకర్ మాట్లాడుతూ సంఘం కార్యాలపాలను సమర్థవంతంగా నిర్వహిస్తూ సభ్యులకు అవసరమైన సేవలను అందిస్తున్నామని తెలిపారు. సభ్యుల సూచనలు సలహాలను పరిగణనలోకి తీసుకొని సంఘం అభివృద్ధి కృషి చేస్తామని పేర్కొన్నారు. ఉపాధ్యక్షులు కుమార్ యాదవ్, సిఈఓ సుధాకర్, పెద్దమందడి మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ వెంకటేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

# ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం మహాజన సభ నిర్వహణ



మాట్లాడుతున్న సొసైటీ చైర్మన్ డోకూర్ నరేందర్ రెడ్డి

**దేవరకద్ర, సెప్టెంబరు29 ప్రభాతవార్త:** దేవరకద్ర ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో దేవరకద్ర సొసైటీ కార్యాలయంలో మంగళవారం రోజు మహాజనసభ జరిగింది. ఈ సమావేశానికి సొసైటీ చైర్మన్ డోకూర్ నరేందర్ రెడ్డి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా రైతులకు సంబంధించిన పలు అంశాలపై సమావేశంలో చర్చించారు. ముఖ్యంగా రైతుల రుణాలు, ఎరువుల సరఫరా, సొసైటీ అభివృద్ధి తదితర అంశాలపై సమీక్షించారు. రైతులందరూ సొసైటీ ద్వారా రుణాలు తీసుకుని, వాటిని సకాలంలోతిరిగి చెల్లించాలని సూచించారు. రుణాలను సకాలంలో చెల్లించడం ద్వారా సొసైటీ కార్యకలాపాలు మరింత సమర్థవంతంగా కొనసాగించేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. అలాగే ఎరువుల సరఫరాలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా వెంటనే సొసైటీ అధికారులు, సంబంధిత అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్తే వాటిని పరిష్కరించేందుకుచర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. సొసైటీ అభివృద్ధితోపాటు రైతులకు మరింత మెరుగైన సేవలు అందించే అంశాలపై కూడా మహాజనసభలో చర్చించారు. మానిటింగ్ ఆఫీసర్ శ్రీనివాసులు, ఆడిటర్ శ్రీనివాసులు, సీఈఓ శ్రీనివాసులు, సొసైటీ డైరెక్టర్లు వివిధ గ్రామాల నుంచి వచ్చిన రైతులు పాల్గొన్నారు.

# శాస్త్రీయ విత్తనోత్పత్తిపై రైతులకు అవగాహన కార్యక్రమం

**గద్వాల సెప్టెంబర్ 29, ప్రభాతవార్త:** తెలంగాణ రైతు విజ్ఞాన కేంద్రం గద్వాల ఆధ్వర్యంలో పి ఏ సి ఎస్ గద్వాల ద్వారా శాస్త్రీయ విత్తనోత్పత్తి కార్యకలాపాలపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డా. పి. ఆర్చన, సమన్వయకర్త, టీ ఆర్ వి కే గద్వాల రైతులకు శాస్త్రీయ పద్ధతుల్లో విత్తనోత్పత్తి చేపట్టడం ద్వారా నాణ్యమైన విత్తనాలను ఉత్పత్తి చేయడంతో పాటు అదనపు ఆదాయాన్ని పొందవచ్చని వివరించారు. రాబోయే రబీ సీజన్‌లో విత్తనోత్పత్తిని అదనపు ఆదాయ వనరుగా స్వీకరించేలా రైతులను ప్రోత్సహించారు. విత్తన ఎంపిక, నాణ్యమైన విత్తన వినియోగం, పంటల ఎంపిక, విత్తనోత్పత్తిలో పాటించాల్సిన శాస్త్రీయ యాజమాన్య పద్ధతులు, పంట పరిశీలనలు, ధృవీకరణకు సంబంధించిన అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పి ఏ సి ఎస్ సి ఈ ఓ అంజనేయులు, జోనల్ సీడ్ సర్టిఫికేషన్ అధికారి చంద్రశేఖర్ పాల్గొని విత్తనోత్పత్తి, విత్తన ధృవీకరణ, రైతులు పాటించాల్సిన నిబంధనలపై సూచనలు అందించారు. ఈ కార్యక్రమంలో మొత్తం 30 మంది రైతులు పాల్గొన్నట్లు అధికారులు తెలిపారు.

# రెడ్‌క్రాస్‌కు కొత్త సారథులు

**చైర్మన్‌గా పోతుల అమరేందర్‌రెడ్డి** | **వైస్ చైర్మన్‌గా డా. ఎన్.కీర్తన** | **కోశాధికారిగా విష్ణువర్ధన్** | **స్టేట్ మేనేజింగ్ కమిటీ సభ్యుడిగా ఎల్లా భాస్కర్**



నూతనంగా కొలువుదీరిన రెడ్ క్రాస్ సొసైటీ కార్యవర్గం

**వనపర్తి, సెప్టెంబరు29 ప్రభాతవార్త:** వనపర్తి జిల్లా ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ నూతన కార్యవర్గం కొలువుదీరింది. మంగళవారం నిర్వహించిన ఎన్నికల ప్రక్రియ అనంతరం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి, ఎన్నికల అధికారిగా వ్యవహరించిన జిల్లా పంచాయతీ అధికారి రఘునాథ్‌రెడ్డి ఎన్నికల ఫలితాలను వెల్లడించారు. చైర్మన్‌గా పోతుల అమరేందర్‌రెడ్డి, వైస్ చైర్మన్‌గా డాక్టర్ ఎన్.కీర్తన, కోశాధికారిగా చిన్నగోవిందు విష్ణువర్ధన్, స్టేట్ మేనేజింగ్ కమిటీ సభ్యుడిగా ఎల్లా భాస్కర్ ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గ సభ్యులను కలెక్టర్, జిల్లా పంచాయతీ అధికారి, అధికారులు, రెడ్‌క్రాస్ సభ్యులు అభినందించారు. ఈ సందర్భంగా ప్రాంత సేవ ప్రముఖ శివశంకర్, జిల్లా వ్యవస్థాప్రముఖ్ మండల కురుమూర్తి, జిల్లా బీజేపీ అధ్యక్షుడు డి.నారాయణ, కార్యదర్శి పెద్దిరాజు, కుమారస్వామి, శ్రీనివాస్‌గౌడ్, హిందూ వాహిని ప్రముఖ్ అభిలాష్, అరుణ్ విద్యాపీఠం అధ్యక్షుడు సూర్యనారాయణ, కోశాధికారి భానుప్రసాద్ తదితరులు నూతన కార్యవర్గానికి శుభాకాంక్షలు తెలిపారు. రెడ్‌క్రాస్ సేవలను జిల్లాలో మరింత విస్తృతం చేయాలని, విపత్తులసమయంలో సహాయక చర్యలు, రక్తదాన కార్యక్రమాలు, ఆరోగ్య సేవలు, సామాజిక సేవా కార్యక్రమాలను బలోపేతం చేయాలని ఆకాంక్షించారు. నూతన కార్యవర్గం సేవా స్ఫూర్తితో పనిచేసి సంస్థ లక్ష్యాలను ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేస్తామని తెలిపింది.

## అక్టోబర్ 3న మండల స్థాయి సమీక్ష సమావేశం

**నవాబుపేట, సెప్టెంబరు 29, ప్రభాతవార్త:** మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో అక్టోబర్ 3న ఉదయం 10 గంటలకు మండల స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించనున్నట్లు మండల ప్రజా పరిషత్ ఎంపీడీవో జారీ చేసిన నోటీసులో పేర్కొన్నారు. మండల స్థాయిలో స్వచ్ఛ సమాహాంనిర్వహించి, స్వచ్ఛ పాలనకు సంబంధించిన అంశాలపై సమీక్ష చేపట్టనున్నారు. గ్రామ పంచాయతీల్లో పారిశుద్ధ్యం, తాగునీరు, పచ్చదనం, విద్యుత్, డ్రైనేజీ, ఇంటింటా చెత్త సేకరణ, గృహ నిర్మాణం, వ్యర్థాల నిర్వహణ తదితర అంశాలపై సమీక్ష జరగనుంది. అలాగే గ్రామ పంచాయతీల్లో తడి, పొడి చెత్త వేరు చేయడం, చెత్త సేకరణ, పారిశుద్ధ్య నిర్వహణ, ఎస్‌డబ్ల్యూఎం గ్రామ పంచాయతీల్లో సేంద్రియ ఎరువుల తయారీ, ఓపెన్ సోర్స్ రిజర్వాయర్ స్థలాల వివరాలు, వీధి కుక్కల నియంత్రణకు సంబంధించిన ఏబిసి కార్యక్రమాలు తదితర అంశాలను పరిశీలించనున్నారు. సమావేశానికి సంబంధిత అధికారులు, సిబ్బంది, గ్రామ పంచాయతీల సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు హాజరు కావాలని నోటీసులో సూచించారు.

## ఉచిత పశువైద్య శిబిరం

**మద్దూరు, సెప్టెంబరు 29 ప్రభాతవార్త :** మద్దూరు మండలం దొరపల్లి గ్రామంలో మంగళవారం ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో 35 గేదెలు, 18 ఆవులకు ఉచిత గర్భకోశ, చూడి పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు అందజేశారు. అలాగే 35 దూడలకు నట్టల నివారణ మందులు వేశారు. సర్పంచ్ కె. నవిత అశోక్‌గౌడ్ దూడలకు నట్టల మందులు వేశారు. కార్యక్రమంలో పశువైద్యాధికారి డా. సబిత, సూపర్‌వైజర్ విజయ్, గోపాలమిత్ర బృందం పాల్గొన్నారు.

## 10 నెలల పసికందుకు అరుదైన ఆపరేషన్

**విజయవంతంగా నిర్వహించిన యశోద ఆస్పత్రి వైద్యులు**

**మహబూబ్ నగర్, సెప్టెంబరు 29 ప్రభాతవార్త :** వారసత్వంగా వచ్చే అమెగాకార్యోసైటిక్ థ్రోంబోసైటోపెనియా అనే అరుదైన ఎముక మజ్జ వైఫల్యంతో బాధపడుతున్న 10నెలల వయ సున్న బాబుకు యశోద ఆస్పత్రి వైద్యులు అత్యాధునిక హాప్లోయిడెంటికల్ స్టెమ్ సెల్ మార్పిడి చేసి కొత్త జీవితాన్ని అందించారు. విలేకరుల సమావేశంలో బోన్ మ్యారో ట్రాన్స్ ప్లాంట్ స్పెషలిస్ట్ డా. విక్రమ్ కుమార్ కేసు వివరాలను వెల్లడించారు. ఏపీలోని కర్నూలు జిల్లా నందవరం గ్రామానికి చెందిన ముల్ల ఖాజా, రేష్మల చిన్నారి ఎం.ఖాదర్ అర్మాన్ (10 నెలలు) ప్లేట్లెట్స్ కౌంట్ తక్కువగా ఉండటాన్ని గుర్తించారు. గతేడాది డిసెంబర్ 26 సోమాజిగూడ యశోద ఆస్పత్రికి తీసుకొచ్చారు. సమగ్ర క్లినికల్ పరీక్షల అనంతరం అమెగాకార్యోసైటిక్ థ్రోంబోసైటోపెనియా ఉన్నట్లుచికిత్స పూర్తిచేసుకున్నచిన్నారితో వైద్య బృందంనిర్ధారణ అయింది. ఇది తీవ్రమైన థ్రోంబోసైటోపె నియా, రక్తస్రావం, ప్రమాదంతోకూడిన అరుదైన వారసత్వంగా వచ్చే ఎముక మజ్జ వైఫల్య రుగ్మతగా గుర్తించాం. తండ్రి మూలకణాలను ఉపయోగించి హాప్లోయిడెంటికల్ స్టెమ్ సెల్ ట్రాన్స్ ప్లాంటేషన్ జనవరి 8న విజయవంతంగా నిర్వహించాం. బాబు వైద్యపరంగా స్థిరంగా ఉన్నాడని నిర్ధారించుకున్న తరువాత డిశ్చార్జ్ చేశామని ఆయన వివరించారు.

## రైతుల విద్యుత్ సమస్యలపై అధికారుల పరిశీలన

**త్వరలోనే పరిష్కారం చూపుతామని హామీ**

**నవాబుపేట, సెప్టెంబరు 29, ప్రభాతవార్త:** రైతుల సమస్యలపై జిల్లా విద్యుత్ అధికారులు గ్రామపంచాయతీ పరిధిలో విద్యుత్ శాఖ అధికారులు మంగళవారం ప్రజా బాటలో భాగంగా పర్యటించారు. గ్రామంలోని రైతులు, ప్రజలను కలిసి విద్యుత్‌కు సంబంధించిన సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో పాత విద్యుత్ స్తంభాల స్థానంలో కొత్త స్తంభాలను ఏర్పాటు చేయడం, రైతుల పొలాల్లో ఉన్న లూజ్ లైన్లను సరిచేయడం, ట్రాన్స్ ఫార్మర్ల వద్ద అవసరమైన ఆన్-ఆఫ్ సౌకర్యం కల్పించడం వంటి సమస్యలను రైతులు అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. గ్రామంలో ఉన్న విద్యుత్ సమస్యలను పరిశీలించి దశలవారీగా పరిష్కరిస్తామని అధికారులు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ సూపరింటెండెంట్ఆఫ్ ఇంజనీర్ భీమ్లా నాయక్, డీఈ చంద్రమౌళి, ఏడీ నవీన్ కుమార్, ఏఈ సుధీర్ రెడ్డి, ఏఈ అఖిల్, లైన్‌మెన్ కృష్ణ, గ్రామ సర్పంచ్ బాలకిష్టమ్మ, రాములు తో పాటు గ్రామ ప్రజలు, రైతులు రామ్‌రెడ్డి, రాములు, గోపాల్‌రెడ్డి, శ్రీశైలం పాల్గొన్నారు.

## ఘనంగా అంతర్జాతీయ వయో వృద్ధుల వారోత్సవాలు

**మహబూబ్‌నగర్, సెప్టెంబరు 29 ప్రభాతవార్త:** అంతర్జాతీయ వయో వృద్ధుల వారోత్సవాలు 2026 లో భాగంగా మహబూబ్ నగర్ లోని "ప్రణాం" డే కేర్ సెంటర్ లో వృద్ధుల పట్ల నిర్లక్ష్యం, దోపిడీపై, వృద్ధుల సంరక్షణ చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా న్యాయ సేవా సంస్థ కార్యదర్శి ఇందిరా, జిల్లా సంక్షేమ అధికారి జరీనా బేగం ఆధ్వర్యంలో వృద్ధులకు ఉచిత వైద్య, కంటి, దంత వైద్య శిబిరాలను నిర్వహించారు. కార్యక్రమంలో డీటీసీఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డా. సునీత, సీడీపీఓ శైలశ్రీ, మెడికల్ ఆఫీసర్ డా. నరేష్ చంద్ర, కంటి, దంత వైద్య సిబ్బంది, జిల్లా సంక్షేమ కార్యాలయ సిబ్బంది, సీనియర్ సిటిజన్ ఫోరం సభ్యులు, వయో వృద్ధులు పాల్గొన్నారు.

## 7 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత



**కేటిదొడ్డి సెప్టెంబర్ 29, ప్రభాతవార్త:** మండల పరిధిలోని ఈర్లబండ గ్రామ శివారులో మంగళవారం ఉదయం 6:15 గంటలకు రేషన్ బియ్యం అక్రమ రవాణా చేస్తున్న వాహనాన్ని అధికారులు పట్టుకున్నారు. నీలహళ్లి గ్రామానికి చెందిన వ్యక్తి కురువ వీరన్నతన బొలెరో వాహనంలో 7క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని అక్రమంగా రాయిచూరుకు తరలిస్తుండగా పట్టుకున్నట్లు అధికారులు తెలిపారు. అతనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పి.శ్రీనివాసులు తెలిపారు.

## సెల్ ఫోన్‌కు దూరంగా ఉండాలి

**సన్మార్గంలో ప్రయాణించే వారికి దీర్ఘకాలంలో మంచి ఫలితాలు**
**కమిషనర్ ఆఫ్ కాలేజియేట్ అండ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ దేవసేన**
**ఎదిర జడ్పీ హైస్కూల్ లో సైన్స్ ప్రదర్శన**




మాట్లాడుతున్న కమిషనర్ ఆఫ్ కాలేజియేట్ అండ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ దేవసేన

**మహబూబ్‌నగర్, సెప్టెంబరు29 ప్రభాతవార్త:** విద్యార్థులు ముఖ్యంగా సెల్ఫోన్‌కు దూరంగా ఉండాలని కమిషనర్ ఆఫ్ కాలేజియేట్ అండ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ దేవసేన అన్నారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఎదిరలో మంగళవారం నిర్వహించిన సైన్స్ ప్రదర్శనకు ముఖ్య అతిథిగా కమిషనర్ ఆఫ్ కాలేజియేట్ అండ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ దేవసేన హాజరయ్యారు. పాఠశాల విద్యార్థులు తయారు చేసిన వివిధ సైన్స్ ప్రాజెక్టులను ఆమె పరిశీలించి, ప్రతి ప్రదర్శన వద్ద విద్యార్థులను ప్రశ్నలు అడిగి సమాధానాలు తెలుసుకున్నారు. విద్యార్థుల ప్రతిభను మెచ్చుకుని అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థుల ద్వారా బ్లడ్ గ్రూప్ పరీక్ష కూడా చేయించుకున్నారు. అనంతరం విద్యార్థులు, ఉపాధ్యాయులను ఉద్దేశించి మాట్లాడుతూ విద్యార్థులు సెల్ ఫోన్‌కు దూరంగా ఉండాలని, మంచిని ప్రోత్సహించాలని, మంచి మార్గంలో నడవాలని సూచించారు. సన్మార్గంలో ప్రయాణించే వారికి దీర్ఘకాలంలో మంచిఫలితాలు వస్తాయనితెలిపారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారి శ్రీమతి విజయకుమారి, ఏఎంఓ శ్రీనివాస్, ప్రధానోపాధ్యాయులు హేమచంద్రుడు, డీఎస్ఓ షంషేర్, బీసీగురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీకాంత్, కాంప్లెక్స్ టీచర్లు, పాఠశాలఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## మామిడి సాగులో అధిక దిగుబడులకు శాస్త్రీయ యాజమాన్య పద్ధతులు పాటించాలి




సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా అధికారి జి.రాజ్ కుమార్

**కెటిదొడ్డి సెప్టెంబర్ 29, ప్రభాతవార్త:** మామిడి సాగులో అధిక దిగుబడులు సాధించేందుకు శాస్త్రీయ యాజమాన్య పద్ధతులు పాటించాలని జిల్లా ఉద్యానవన అధికారి జి.రాజ్ కుమార్ అన్నారు. మండలం పరిధిలోని చింతలకుంట గ్రామం లో ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో మామిడి సాగుపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. మామిడి తోటలపై ఎల్‌నినో ప్రభావం, ప్రతికూల వాతావరణ పరిస్థితుల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పంటలో అధిక నాణ్యతతో కూడిన దిగుబడులు సాధించేందుకు అనుసరించాల్సిన శాస్త్రీయ యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జిల్లా ఉద్యానవన అధికారిజి.రాజ్‌కుమార్ మాట్లాడుతూ... జిల్లాలో నెలకొంటున్న వర్షపాత పరిస్థితులు, ఎల్‌నినో ప్రభావంతో ఉద్యాన పంటలపై ఏర్పడే ప్రతికూల పరిస్థితులను రైతులకు వివరించారు. వాతావరణ మార్పుల నేపథ్యంలో రైతులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడంతో పాటు నీటి సంరక్షణ పద్ధతులను పాటించాలని సూచించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న మామిడి క్లస్టర్ డెవలప్మెంట్ పథకం ద్వారా రైతులకు అందుతున్న సబ్సిడీలు, మార్కెటింగ్ సదుపాయాలు, మౌలిక వసతుల అభివృద్ధి తదితర అంశాలను వివరించారు. రైతులు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకుని మామిడి సాగులో ఉత్పాదకతను పెంచుకోవాలని సూచించారు. సంగారెడ్డి ఫ్రూట్ రీసెర్చ్ స్టేషన్ ప్లాంట్ పాథాలజీ శాస్త్రవేత్త మోనిక మామిడి తోటల్లో వచ్చే ప్రధాన పురుగు, తెగుళ్ల నివారణపై రైతులకు క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించారు. ముఖ్యంగా తేనె మంచు పురుగు (హనీ హాప్పర్), పండు ఈగ (ఫ్రూట్ ఫ్లై), నల్లటి బూజు తెగులు (సూటీ మోల్డ్), మచ్చ తెగులు (ఆంత్రాక్నోస్) వంటివాటి లక్షణాలను వివరించారు. వాటిని గుర్తించిన వెంటనే సమగ్రసస్యరక్షణ చర్యలుచేపట్టాలని, అవసరమైనపిచికారీ మందులు మరియు వాటి వినియోగ విధానంపై రైతులకు సూచనలు అందించారు. ఈ కార్యక్రమంలో స్థానికసర్పంచ్, సింగిల్ విండోడైరెక్టర్, ఉద్యానవన శాఖ అధికారులు, మండల వ్యవసాయ అధికారి, వ్యవసాయ విస్తరణ అధికారులు, ఉద్యానవన శాఖసిబ్బంది, రైతు ప్రతినిధులు, పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

## పట్టభద్రులు ఓటరు నమోదు చేసుకోవాలి

**-దేవరకద్ర మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి**

**భూత్పూర్/ దేవరకద్ర సెప్టెంబర్ 29, ప్రభాతవార్త :** హైదరాబాద్, రంగారెడ్డి, మహబూబ్ నగర్ జిల్లాల ఎమ్మెల్సీ పదవీకి త్వరలో జరిగే గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల దృష్ట్యా పట్టభద్రులు తమ ఓటరు నమోదును చేసుకోవాలని దేవరకద్ర మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి దేవరకద్ర నియోజకర్గంలోని గ్రాడ్యుయేట్లకు పిలుపునిచ్చారు. ఇదివరకు గ్రాడ్యుయేట్లుగా ఓటు హక్కు కల్గి ఉన్నప్పటికి తిరిగి ఓటరుగా రెన్యూవల్ చేసేందుకు ఓటరు నమోదు ఫారమ్ 18ని నింపి గ్రాడ్యుయేట్లు తమ ఓటునుపదిల పరుచుకోవాలని మాజీ ఎమ్మెల్యే ఆలసూచించారు. ఓటరునమోదుకు ప్రతీ గ్రాడ్యుయేట్ ఆధార్‌కార్డు, పాస్‌పోర్టుసైజుఫోటో, డిగ్రీ సర్టిఫికేట్ వెంట తీసుకుని వెళ్లాలని సూచించారు. గ్ర్యాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలో గ్రాడ్యుయేట్లు నిశిత దృష్టితో ఆలోచించి ప్రాధాన్యత ఓటు వేసి సరైన వ్యక్తిని ఎమ్మెల్సీగా పెద్దల సభకు పంపాలని మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి సూచించారు.

## గ్రామాల్లో లోవోల్టేజ్ సమస్య.. విద్యుత్ అధికారులు ఏం చేస్తున్నారు?

**సభలో నిలదీస్తున్న సర్పంచ్‌లు**

**గండిడ్ సెప్టెంబర్29, ప్రభాతవార్త:** గండిడ్ మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించి నసర్వసభ్య సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన పరిగి ఎమ్మెల్యే టి. రామ్మోహన్ రెడ్డి మాట్లాడుతూ దేశ చరిత్రలో లేని విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీ ప్రకారం ఏకకాలంలో రెండు లక్షల రైతు రుణమాఫీ ఉచిత కరెంట్ మహిళలకు ఫ్రీ బస్ లాంటి మరెన్నో సంక్షేమ పథకాలను చేపట్టడం జరిగిందని అన్నారు. వర్షాలు లేకపోగా గ్రామాల్లో ప్రజలకుత్రాగునీటి నీటి సమస్య తలెత్తకుండా చూడాలని అధికారులకు సర్పంచులకు సూచించారు. అనంతరం అధికారుల సమీక్ష లో వోల్టేజి విద్యుత్ సమస్యతో అధికారులపై సర్పంచులు విరుచుకుపడ్డారు గ్రామాల్లో బోరు మోటర్లు ఖాళీ పోయి త్రాగునీటి సమస్య ఏర్పడిందని గండిడ్. సర్పంచ్ భగవంతుడి అధికారులదృష్టికి తీసుకువచ్చారు. అంతే కాకుండా కొమిరెడ్డిపల్లి. పగిడియాల జిన్నారం తండా. గ్రామాల సర్పంచులు విద్యుత్ సమస్యలపై అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. త్వరలో సమస్యను పరిష్కరిస్తామని విద్యుత్ అధికారులు హామీ ఇచ్చారు. గ్రామాల్లో ఏ సమస్యఉన్నఅధికారులు సర్పంచులు సమన్వయంతో పనిచేయాలని ఎమ్మెల్యే సూచించారు. ఈ కార్యక్రమంలో మండల తాసిల్దార్ రాజాగోపాల్. విద్యుత్ ఏడి ఎంపీడీవో మంజుల. ఎంపీ ఓ నరేందర్ రెడ్డి. స్పెషల్ ఆఫీసర్ పలు శాఖల అధికారులు పలు శాఖల అధికారులు సర్పంచులు పాల్గొన్నారు.




సమావేశంలో మాట్లాడుతున్న పరిగి ఎమ్మెల్యే టి. రామ్మోహన్ రెడ్డి

# డ్రగ్స్ మహమ్మారిపై ఉక్కుపాదం

**గద్వాల సెప్టెంబర్ 29, ప్రభాతవార్త:** జోగులాంబ గద్వాల్ జిల్లా కేంద్రంలోని జిల్లా ఎస్పీ కార్యాలయంలో మంగళవారం తెలంగాణ ఈగల్ ఫోర్స్ ఆధ్వర్యంలో డ్రగ్స్ నియంత్రణ, నివారణ చర్యలపై ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించారు. యువత, విద్యార్థులు మాదకద్రవ్యాల బారిన పడకుండా ముందస్తు చర్యలు చేపట్టడం, డ్రగ్స్ వినియోగం, అక్రమ రవాణాను అరికట్టడం, నషా ముక్త్ భారత్ లక్ష్య సాధన దిశగా పోలీస్ శాఖతోపాటు అన్ని వర్గాలను భాగస్వామ్యాన్ని పెంచడంపై సమావేశంలో ప్రధానంగా చర్చించారు. ఈ సందర్భంగా తెలంగాణ ఈగల్ ఫోర్స్‌కు ఎస్పీ పి.వి. పద్మజ, మాట్లాడుతూ... డ్రగ్స్ సమస్యను కేవలం పోలీసింగ్ అంశంగా కాకుండా భవిష్యత్ తరాల భద్రతకు సంబంధించిన సామాజిక బాధ్యతగా చూడాల్సిన అవసరం ఉందన్నారు. యువత మాదకద్రవ్యాలకు ఆకర్షితులు కాకుండా విద్యాసంస్థలు, తల్లిదండ్రులు, పోలీస్ శాఖ, స్వచ్ఛంద సంస్థలు, ప్రజలు సమన్వయంతోపనిచేయాలనిసూచించారు. మాదకద్రవ్యాల వినియోగం, విక్రయం లేదా అనుమానాస్పద కార్యకలాపాలపై సమాచారం అందించేందుకు అందుబాటులో ఉన్న యాంటీ డ్రగ్ హెల్ప్‌లైన్ 1908 సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. డ్రగ్స్‌కు సంబంధించిన సమాచారాన్ని సకాలంలో పోలీసుల దృష్టికి తీసుకురావడం ద్వారాఅనేక నేరాలను ముందుగానే అడ్డుకోవచ్చని, ముఖ్యంగా యువతను డ్రగ్స్‌కు దూరంగా ఉంచడంలో ప్రజల సహకారం కీలకమని పేర్కొన్నారు. డ్రగ్స్ కేసుల్లో కేసు నమోదు నుంచి దర్యాప్తు, ఆధారాల సేకరణ, నిందితుల గుర్తింపు, తదుపరి న్యాయపరమైన చర్యల వరకు అనుసరించాల్సిన విధివిధానాలపై పోలీసు అధికారులకు అవగాహన కల్పించారు. దర్యాప్తు సమయంలో ఎదురయ్యే సమస్యలను ఎలా అధిగమించాలి, కేసులను మరింత పకడ్బందీగా ఎలా ముందుకు తీసుకెళ్లాలి అనే అంశాలపై కూడా సూచనలు చేశారు. అనంతరం జిల్లా ఎస్పీ టి. శ్రీనివాసరావు మాట్లాడుతూ.. జిల్లాలో డ్రగ్స్ నిర్మూలనకు పోలీస్ శాఖ అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ముఖ్యంగా విద్యార్థులు, యువతను మాదకద్రవ్యాల ప్రభావం నుంచి రక్షించేందుకు విద్యాసంస్థల స్థాయిలో అవగాహన, పర్యవేక్షణ, ముందస్తు నివారణ చర్యలను మరింత సమర్థవంతంగా అమలు చేయాల్సిన అవసరం ఉందని తెలిపారు. జిల్లాలోని వివిధ కళాశాలల్లో ఏర్పాటు చేసిన యాంటీ డ్రగ్ స్క్వాడ్ల పనితీరు, వాటి ద్వారా చేపడుతున్న అవగాహన కార్యక్రమాలు, విద్యార్థుల భాగస్వామ్యం తదితర అంశాలను ఈగల్ ఫోర్స్ అధికారులు జిల్లా ఎస్పీని అడిగి తెలుసుకున్నారు. ఆయా స్క్వాడ్లను మరింత చురుకుగా పనిచేసేలా ప్రోత్సహించడంతో పాటు, అనుమానాస్పద కార్యకలాపాలపై సమాచారం సేకరించడం, విద్యార్థుల్లో డ్రగ్స్ వల్ల కలిగే దుష్పరిణామాలపై నిరంతర అవగాహన కల్పించడం వంటి అంశాలపై చర్చించారు. డ్రగ్స్ వ్యతిరేక పోరాటంలో "నివారణ- అవగాహన-నిఘా-చట్టపరమైన చర్యలు"అనే నాలుగు అంశాలను సమన్వయంతో ముందుకు తీసుకెళ్లాలని అధికారులు పేర్కొన్నారు. కేవలం కేసులు నమోదు చేయడం మాత్రమే కాకుండా డ్రగ్స్‌కు డిమాండ్ తగ్గించడం, సరఫరా మార్గాలను గుర్తించడం, యువతను ముందుగానే అప్రమత్తం చేయడం, డ్రగ్స్‌కు బానిసైన వారికి అవసరమైన సహాయాన్ని అందించే విధంగా సంబంధిత శాఖలతో సమన్వయం చేసుకోవడంపై దృష్టి సారించాలని సూచించారు. ఈ సమావేశంలో తెలంగాణ ఈగల్ ఫోర్స్ డీఎస్పీ బుచ్చయ్య, గద్వాల్ డి.ఎస్పీ వై. మొగిలయ్య, ఈగల్ ఫోర్స్ బృందం, గద్వాల్, అలంపూర్, శాంతినగర్ సర్కిల్ అధికారులు, ఎస్సైలు, డి.సి.ఆర్.బి. సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ పద్మజ, ఎస్పీ శ్రీనివాసరావు

# పట్టభద్రుల ఓటుకు కొత్త దరఖాస్తు

- ఎమ్మెల్సీ ఎన్నికల కోసం ఓటరు జాబితా నోటిఫికేషన్ విడుదల
- ఫారం 18తో నవంబర్ 6 లోగా దరఖాస్తు చేసుకోవాలి
- వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి

**వనపర్తి, సెప్టెంబరు 29 ప్రభాతవార్త :** మహబూబ్‌నగర్-రంగారెడ్డి-హైదరాబాద్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి కొత్త ఓటరు జాబితా రూపకల్పనకునోటిఫికేషన్ విడుదలైంది. మంగళవారం వనపర్తి కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో నిర్వహించిన మీడియా సమావే శంలో జిల్లా కలెక్టర్ ఆదర్శ్‌సురభి నోటిఫికేషన్ వివరాలను వెల్లడించారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించు కోవాలంటే గతంలో ఓటరుగా నమోదు అయి ఉన్నప్పటికీ, ప్రస్తుతం కొత్తగా ఫారం 18 ద్వారా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందని కలెక్టర్ స్పష్టం చేశారు. ఆన్‌లైన్‌లో లేదా ఆఫ్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునే అవకాశం ఉందన్నారు. నవంబరు 1,2026 నాటికి మూడేళ్లకు ముందు గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన వారు మాత్రమే ఓటరుగా నమోదు చేసుకు నేందుకు అర్హులని తెలిపారు. నవంబరు 6లోగా దరఖాస్తుఅర్హులైన పట్టభద్రులు నవంబరు 6లోగా ఫారం18 ద్వారాదరఖాస్తు చేసుకో వాలని కలెక్టర్ సూచించారు. దరఖాస్తుల పరిశీలనలో భాగంగా అధికా రులు సంబంధిత అభ్యర్థుల ఇళ్లకు వెళ్లి భౌతికంగా వివరాలను తనిఖీ చేస్తారని తెలిపారు. ఈ సందర్భంగా చిరునామా ధ్రువీకరణ పత్రంతో పాటు గ్రాడ్యుయేషన్ సర్టిఫికెట్‌ను చూపించాల్సి ఉంటుందన్నారు. నవంబరు 25న ముసాయిదా జాబితాఅర్హులైన ఓటర్లతో కూడిన ముసాయిదా ఓటరు జాబితాను నవంబరు 25న విడుదల చేస్తామని కలెక్టర్ తెలిపారు. ముసాయిదా జాబితాపై అభ్యంతరాలను నవంబరు 25 నుంచి డిసెంబరు 10 వరకు స్వీకరిస్తామన్నారు. వచ్చిన అభ్యంత రాలను డిసెంబరు 25లోగా పరిష్కరించి, డిసెంబరు 31న తుది ఓటరు జాబితాను విడుదల చేస్తామని వివరించారు. వనపర్తి జిల్లాలోని అర్హులైన పట్టభద్రులందరూ ఈ అవకాశాన్ని వినియో గించుకుని ఓటరు జాబితాలో పేర్లు నమోదు చేసుకోవాలని కలెక్టర్ కోరారు. ఆఫ్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునే వారు పోస్టు ద్వారాలేదా స్వయంగా సంబంధిత తహసీల్దార్ కార్యాలయంలో గడువులోగా దరఖాస్తులను సమర్పించాలని సూచించారు.



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్

## ప్రపంచ మానవాళి విముక్తికి కమ్యూనిజమే మార్గం

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎండీ అబ్బాస్

**మదనాపురం, సెప్టెంబరు 29 ప్రభాతవార్త :** ప్రపంచంలో మానవాళి విముక్తికీ, మనుగడకూ కమ్యూనిజమే దిక్సూచి అని సీపీఎం తెలంగాణ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎండీ అ బ్బాస్ స్పష్టం చేశారు. మదనాపురం మండల కేంద్రంలోని మార్కెట్ యార్డ్‌లో ఉన్న హమాలీ విశ్రాంతి భవనంలో సీపీఎం జిల్లా విస్తృత స్టడీ సర్కిల్ నిర్వహించారు. పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మండ్ల రాజు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి అబ్బాస్ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు, ఈ సందర్భంగా కమ్యూనిస్టు పార్టీ మేనిఫెస్టో అంశాలను ఆయన సవివరంగా విశ్లేషించారు, ప్రపంచవ్యాప్తంగా రోజురోజుకూ కమ్యూనిస్టు భావజాలం విస్తరిస్తోందని, అనేక దేశాల్లో కమ్యూనిస్టు పార్టీలు అధికారంలోకి వస్తున్నాయని, ఇటీవల శ్రీలంకలో కమ్యూనిస్టు పార్టీ విజయం సాధించి అధి కారంలోకి రావడం, అలాగే అమెరికా సామ్రాజ్యవాద కేంద్రమైన న్యూయార్క్‌లో సైతం విజయాలు నమోదు చేయడమే దీనికి ప్రత్యక్ష నిదర్శనమని పేర్కొన్నారు. పెట్టుబడిదారులు సైతం నేడు కమ్యూనిస్టు మేనిఫెస్టోను అధ్యయనం చేయాల్సి నపరిస్థితి ఏర్పడిందని గుర్తుచేశారు. కమ్యూనిస్టులుగా సమాజంలో ముందు భాగాన నిలిచి, ప్రజావిముక్తి కోసంప్రతి ఒక్కరూ కలిసికట్టుగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. భారతదేశంలో ఎన్నికల నిర్వహణ విధానంపై పెద్ద ఎత్తున బహిరంగ చర్చ జరగాల్సి న అవసరం ఉందని అబ్బాస్ అభిప్రాయపడ్డారు. దీనిని మండల కేంద్రంలో నిరసన తెలిపారు. దేశంలో ప్రతిపక్షాలు, వామపక్ష పార్టీలు దీనిపై పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తున్నప్పటికీ, కేంద్ర ప్రభుత్వం మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందని విమర్శించారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి పుట్ట ఆంజనేయులు, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎండీ జబ్బార్, బాల్‌రెడ్డి, జీఎస్ గోపి, జిల్లా నాయకులు వెంకటరాములు, మేకల ఆంజనేయులు, ఎస్.రాజు, మహబూబ్‌పాషా, జి. వెంకటయ్య, వెంకటేష్, నిక్సన్, అజయ్, పార్టీ సర్పంచ్‌లు కవిత, నిరంజన్, జములయ్య, విష్ణు, వెంకటేష్, చెన్నయ్య, మొగిలి, చిరంజీవి, సుధాకర్, చిన్నరాయుడు, సత్యనారాయణ, మహిళా నాయకులు శాంతమ్మ, సాయిలీల, ఉమ, రమ, లక్ష్మి, స్వాతి, భాగ్య, హరిత, లావణ్య తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎండీ అబ్బాస్

## మృతుడి కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ



**మదనాపురం, సెప్టెంబరు 29 ప్రభాతవార్త :** మండలంలోని దుప్పల్లి గ్రామానికి చెందినగౌడుగు వెంకటయ్య కుమారుడు జితేందర్ బైక్ ప్రమాదంలో దుర్మరణం చెందడంతో ఆయన కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే మంగళవారం పరామర్శించారు. వెంకటయ్య నివాసానికి చేరుకున్న ఎమ్మెల్యే, శోకసంద్రంలో మునిగిపోయిన కుటుంబ సభ్యులను పరామర్శించి, వారికి ధైర్యం చెప్పారు. యంగ్ వయస్సులో కుమా రుడు చనిపోవడం తీవ్ర విచారకరమని, ఈ ఆపద సమయంలో కుటుంబానికి ఎల్లవేళలా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సర్పంచు సుజాతరాజు, మండల పార్టీ అధ్యక్షులు శ్రీనివాస్‌రెడ్డి గ్రామ పార్టీ అధ్యక్షులు సీ శేఖర్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

## జెనిగే హాస్టల్ బాలయ్య కుటుంబానికి ఆర్థిక సాయం

**మదనాపురం, సెప్టెంబరు29 ప్రభాతవార్త:** ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన మదనాపురం పట్టణానికి చెందిన జెనిగే హాస్టల్ బాలయ్య కుటుంబాన్ని మంగళవారం మాజీ రాజ్యసభ సభ్యులు, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు రావుల చంద్రశేఖర్ రెడ్డి పరామర్శించారు. వారి స్వగృహానికి వెళ్లిన రావుల, బాలయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులకు సానుభూతి తెలియజేసి, రూ. 10 వేలు ఆర్థిక సాయం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలయ్యతో తనకు ఉన్న ఆత్మీయ అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. ఆ కుటుంబానికి అన్ని వేళలా అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టౌన్ అధ్యక్షుడు ఆవుల బాలకృష్ణ, కరుణాకర్ యాదవ్, మాజీ మార్కెట్ డైరెక్టర్ వెంకటేష్ యాదవ్, ఉపసర్పంచ్ నాగరాజు, మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు కుమార్, వార్డు సభ్యులు మన్యం శ్రీనివాసులు, సందు వెంకటేష్, బాలస్వామి, ప్రేమదానం, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఎరువుల దుకాణాల్లో ఆకస్మిక తనిఖీలు

**దామరగిద్ద, సెప్టెంబరు 29, ప్రభాతవార్త:** దామరగిద్ద మండలంలోని ఎరువుల దుకాణాల్లో మండల వ్యవసాయ అధికారి బాలాజీ ప్రసాద్ మంగళవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. మండల కేంద్రంతో పాటు లోకుర్తి, మొగుల్ మడ్క, బాపన్‌పల్లి తదితర గ్రామాల్లోని ఫర్టిలైజర్ దుకాణాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎరువుల విక్రయ లైసెన్సులు, కంపెనీ ఓఫారాలు, దుకాణాల్లోని ఎరువుల నిల్వలను తనిఖీ చేశారు. ఈ పాస్ యంత్రంలో నమోదైన స్టాక్‌తో భౌతికంగా ఉన్న నిల్వలను సరిపోల్చి పరిశీలించారు. అనుమతి లేని మిక్స్‌డ్ ఫర్టిలైజర్లను విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని డీలర్లను హెచ్చరించారు. రైతులకు నిబంధనల ప్రకారం ఎరువులు విక్రయించాలని సూచించారు. ఆయన వెంట ఏఈఓలు ఉన్నారు.

## కాంగ్రెస్ పార్టీలో చేరిన కొన్నూరు సర్పంచ్

**మదనాపురం, సెప్టెంబరు 29 ప్రభాతవార్త:** మండలం పరిధిలో కొన్నూరు గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ సర్పంచ్ రసూల్ బీ గుడుష, బిఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున మాజీ ఎంపిటిసి శరత్ రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం దేవరకద్ర ఎమ్మెల్యే జి మధుసూదన్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌పార్టీ కండువా కప్పుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలకు ఆకర్షితులమై బీఆర్ ఎస్ పార్టీకి రాజీనామా చేసి కాంగ్రెస్ పార్టీలో చేరామని సర్పంచ్ తెలిపారు. సర్పంచ్ పార్టీవీడినప్పటి నుంచిబీఆర్ఎస్ పార్టీనికాపాడుకోవడానికి పలు ప్రయత్నాలు చేస్తున్న కార్యకర్తలు, సీనియర్లు పార్టీకి షాకిస్తూ కాంగ్రెస్ పార్టీలోకి వెళ్తున్నారు.



ఎమ్మెల్యే జిఎంఆర్ కాంగ్రెస్ పార్టీలో చేరిన కొన్నూరు సర్పంచ్

## రైతులకు ఇబ్బందులు రానీయొద్దు

(మొదటి పేజీ తరువాయి)

ప్రభుత్వం గుర్తించిన ఏడుసన్న రకాల ధాన్యానికి క్వింటాల్‌కు రూ.500 బోనస్ చెల్లించనున్నట్లు వివరించారు. రైతులు ధాన్యాన్ని నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా శుభ్రపరిచి, ఎండబెట్టి, వ్యవసాయ శాఖ జారీ చేసిన టోకెన్ ప్రకారం నిర్ణయించిన తేదీన కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని సూచించారు. ధాన్యంలో తేమ శాతం గరిష్టంగా 17 శాతం ఉండాలని తెలిపారు. మద్దతు ధర మొత్తాన్ని 48 గంటల్లో రైతులకు అందేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఎల్3 కేటగిరీకి సరిపోయే కొనుగోలు కేంద్రాలను మాత్రమే ఓపి.ఎంఎస్‌కు అనుసంధానం చేయడం జరుగుతుందని తెలిపారు. రబీ 2025,26 కు సంబంధించి ధాన్యం కొనుగోలు కమిషన్ 2 కోట్ల 61 లక్షలరూ.లు బుధవారం సాయంత్రం లోగా కొనుగోలు కేంద్రాల నిర్వాహకుల ఖాతాల్లో జమ చేయాలని డిఆర్‌డిఓ, సహకార శాఖ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ అండర్ ట్రైనీ సాయి శివాని, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) జెఎల్‌బి హరిప్రియ, పౌర సరఫరాల శాఖ డి.ఎం.రవి నాయక్, జిల్లా పౌర సరఫరాల అధికారి గంప శ్రీనివాస్, డిఆర్‌డిఓ నర్సింహులు, జిల్లా సహకార అధికారి కృష్ణ, జిల్లా వ్యవసాయ అధికారి గోవింద్ నాయక్, జిల్లా లీగల్ మెట్రాలజీ అధికారి రవీందర్, జిల్లా సహకార ఆడిట్ అధికారి టైటస్ పాల్, జిల్లా మార్కెటింగ్ అధికారిని బాలమణి, సంబంధిత శాఖల అధికారులు, కొనుగోలుకేంద్రాల నిర్వాహకులు, పీఏసీఎస్, ఐకేపీ, మార్కెట్ కమిటీలు, పర్యవేక్షణ అధికారులు, వ్యవసాయ విస్తరణ అధికారులు, ధాన్యం రవాణా కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.

## ఖరీఫ్ వరి కొనుగోళ్లకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

(మొదటి పేజీ తరువాయి)

ప్రభుత్వం ప్రకటించిన కనీస మద్దతు ధర రైతులకు అందేలా చర్యలు తీసుకోవాలని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ధాన్యం రవాణా, నిల్వకు అవసరమైన గిడ్డంగి సౌకర్యాలను ముందుగానే సిద్ధం చేయాలని, ధాన్యంరవాణాను సమర్థవంతంగా పర్యవేక్షించేందుకు వాహనాల కదలికలను ఎప్పటికప్పుడు గమనించేలా తగిన చర్యలు చేపట్టాలని సూచించారు. కొనుగోలు కేంద్రాల నిర్వహణలో పారదర్శకత, జవాబుదారీతనం పెంపొందించడంతోపాటు రైతులకు సకాలంలో సేవలు అందించడమే PCSAP విధానం ప్రధాన లక్ష్యమని, ధాన్యం కొనుగోలు, రవాణా, నిల్వతదితర అంశాల్లో వివిధ శాఖల మధ్య సమన్వయం అత్యంత కీలకమని తెలిపారు. క్షేత్రస్థాయిలో ఎదురయ్యే సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించి వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశం చారు. వాతావరణ పరిస్థితులను నిరంతరం పర్యవేక్షిస్తూ, రైతులకు ముందస్తు సమాచారం అందించేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్ స్పష్టం చేశారు.

## పందుల బెడద

**దేవరకద్ర, సెప్టెంబరు 29 ప్రభాతవార్త:** కౌకుంట్ల మండలంలోని పలు గ్రామాల్లో పందుల బెడద రోజురోజుకు పెరుగుతున్న సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గుంపులు గుంపులుగా పందులు వీధుల్లో సంచరిస్తూ ఇలా సమీపంలో రహదారుల వెంట ఎక్కడపడితే అక్కడ పడుకుంటూ స్వైర విహారం చేస్తున్నాయని ప్రజలు చెబుతున్నారు. పందుల సంచారంతో పరిసరాలు అపరిశుభ్రంగా మారడంతోపాటు, దుర్వాసనతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారనిస్థానికులు వాపోతున్నారు. ముఖ్యంగా చిన్నారులు వృద్ధులురాకపోకలు సాగించే సమయంలో పందులు రోడ్లపై గుంపులుగా తిరుగుతుండడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు.

**పంచాయతీ కార్యదర్శి, సర్పంచ్ స్పందించాలి:** కౌకుంట్ల మండలంలోని వివిధ గ్రామాల్లో పారిశుద్ధ్య పరిస్థితులపై పర్యవేక్షణ చేయాల్సిన పంచాయతీ కార్యదర్శి, గ్రామ సర్పంచ్, అధికారులు ఈ సమస్యపై ప్రత్యేక దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు. పందుల యాజమాన్యులకు అవగాహన కల్పించడంతో పాటు విచ్చలవిడిగా పందులను రోడ్లపై వదిలేస్తున్న వారిపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి, పందుల బెడదకుశాశ్వత పరిష్కారం చూపాలని, గ్రామాల్లో పారిశుద్ధ్యం కాపాడేలా చర్యలు చేపట్టాలని కౌకుంట్ల మండల ప్రజలు కోరుతున్నారు.

## ఇద్దరు మున్సిపల్ ఉద్యోగుల సస్పెన్షన్

**గద్వాల సెప్టెంబర్ 29, ప్రభాతవార్త :** గద్వాల మున్సిపాలిటీలో మున్సిపల్ షాపుల అద్దెలకు సంబంధించి వసూలు చేసిన రూ.11.28 లక్షలు సంబంధిత అధికారులు మున్సిపల్ ఖాతాలో జమ చేయకపోవడాన్ని తీవ్ర తప్పిదంగా పరిగణిస్తూ జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్ మంగళవారం తగు చర్యలు చేపట్టారు. ఈ వ్యవహారంలో సీనియర్ అసిస్టెంట్, ఇన్‌చార్జ్ రెవెన్యూఇన్‌స్పెక్టర్ రాజవర్ధన్, జూనియర్ అసిస్టెంట్, ఇన్‌చార్జ్ షరాఫ్ రాజవర్ధన్ నాయుడులను సస్పెండ్ చేశారు. ఈ ఘటనపై సమగ్ర విచారణకు అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) నర్సింగరావును విచారణఅధికారిగా నియమించారు. సంబంధిత రశీదు పుస్తకాలు, రికార్డులు, రిమిటెన్స్ వివరాలనుపరిశీలించి సమగ్ర నివేదిక సమర్పించాలని ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఆదేశించారు.

## ఎస్టీలకు భరోసా..ఎస్టీ కమిషన్

(మొదటి పేజీ తరువాయి)

సూచించారు. చాలా సమస్యలు రేవెన్యూ, ఫారెస్ట్ అధికారులు జాయింట్ సర్వే చేసి సమస్యలు పరిష్కరించాలని సూచించారు. వనపర్తి జిల్లాలోని చాలా గ్రామాల్లో టెలిఫోన్ సిగ్నల్ సరిగ్గా లేదని, బి.ఎస్.ఎన్.ఎల్. అధికారులు చాలా నిరక్ష్యంగా ఉన్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎక్కడెక్కడ సిగ్నల్ సమస్య ఉందో గుర్తించి ఉన్నతాధికారులకు నివేదిక పంపించాల్సిన బాధ్యత తీసుకోవాలని బిఎస్ఎన్ఎల్ అధికారిని ఆదేశించారు. ఈ సమీక్ష సమావేశంలో అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ ఎన్. ఖీమ్యానాయక్, అదనపు కలెక్టర్ రెవెన్యూ టి. వినోద్ కుమార్, జిల్లా అధికారులు, ఎస్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## పేద ప్రజలకు అండగా ప్రజా ప్రభుత్వం

(మొదటి పేజీ తరువాయి)

దగ్గరికి వెళ్లా లన్న మార్పు తీసుకువచ్చామని ప్రజలకు జవాబు దారీగా ఉంటామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ మునిరుద్దీన్ ,ఎంపీడీవో కథలప్ప, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మిద్దె రాములు, వెంకట్ స్వామి అమృత్ రెడ్డి, హరీశ్వర్ రెడ్డి, దీప్లా నాయక్, బంగారయ్య, మాన్యనాయక్, జాలం నాగయ్య, మల్లికార్జున రెడ్డి, హార్యా, వెంకట్రావు, నిరంజన్ రావు, ముక్తార్ పాషా, నజీర్, వాల్యనాయక్, రాములు, ఆయా గ్రామాల లబ్ధిదారులు పాల్గొన్నారు.

## దివ్యాంగ విద్యార్థుల జూ పార్క్ సందర్శన

**ఉల్లాసంగా సాగిన ఎక్స్ పోజర్ విజిట్**

**మహబూబ్‌నగర్, సెప్టెంబరు 29, ప్రభాతవార్త:** సమగ్ర శిక్ష సమ్మిళిత విద్య కార్యక్రమంలో భాగంగా మహబూబ్ నగర్ జిల్లాకు చెందిన దివ్యాంగ (దిడబ్ల్యూ ఎస్ఎన్) విద్యార్థులకు ప్రత్యేక ఎక్స్ పోజర్ విజిట్‌ను నిర్వహించారు. సోమవారం 120 మంది సిడబ్ల్యూఎస్ఎన్ విద్యార్థులు, 30 మంది తల్లిదండ్రులు, 50 మంది స్పెషల్ ఎడ్యుకేటర్లు, ఐఈఆర్పీలు, మహబూబ్నగర్ సీఎంఓ సుధాకర్ రెడ్డి సమన్వయంతో హైదరాబాద్ జూ పార్క్ ను సందర్శించినట్లు జిల్లా విద్యాశాఖ అధికారి విజయకుమారి తెలిపారు. జూపార్క్‌లో విద్యార్థులువివిధ రకాల జంతువులు, పక్షులు మరియు ప్రకృతి అందాలను ప్రత్యక్షంగా వీక్షిస్తూ ఎంతో ఉత్సాహంగాగడిపారు. పుస్తకాల్లో, చిత్రాల్లో చూసిన జంతు వులను ప్రత్యక్షంగా చూడటం విద్యార్థుల్లో ఆసక్తిని పెంచింది. జంతువుల జీవన విధానం, వాటిఆవాసాలు, ఆహారపుఅలవాట్లను ప్రత్యక్షంగా తెలుసుకున్నారు. అనంతరంశంషాబాద్ రాజీవ్‌గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం ,ముచ్చింతల్ సమతామూర్తివిగ్రహాన్ని కూడా వీక్షించారు. ఈ సందర్శన కేవలం వినోద కార్యక్రమంగా కాకుండా విద్యార్థుల్లో పరిశీలనా శక్తి, సామాజిక నైపుణ్యాలు, ఆత్మవిశ్వాసం మరియు ప్రకృతి పట్ల అవగాహన పెంపొందించే విద్యా అనుభవంగా నిలిచిందని డీఈఓ తెలిపారు.